TGTEL/26/A0320

# భారతీయ వెలుగు

జాతీయ తెలుగు దిన పత్రిక




శనివారం ఫిబ్రవరి 21, 2026 | సంపుటి :01 | సంచిక :34 | రంగారెడ్డి | గున్నాల లావణ్య | పేజీలు -12 | వెల-5

Hyderabad,KarimNagar, Warangal, Khammam, Nalgonda, Mahabub Nagar, Nizamabad, Gadwal, Medak, Vikarabad, Wanaparthy, Siddipet,

# సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

- మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఎఐ
- ఎఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి
- హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం
- ఏఐ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో సిఎం రేవంత్ రెడ్డి



గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్శిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు.

మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చుకోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్,

పేజి 2లో

## 'సర్' విధుల్లో జ్యుడిషియల్ అధికారులు..

## సుప్రీం అసాధారణ నిర్ణయం



మిగతాది 2లో

## జీవన్‌రెడ్డికి తగిన గౌరవమివ్వండి: జగ్గారెడ్డి

హైదరాబాద్:



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ కష్ట కాలంలో పార్టీతో ఉన్న జీవన్ రెడ్డికి గౌరవం ఇచ్చే విధంగా పార్టీ హైకమాండ్ చొరవ తీసుకోవాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తాజాగా మాట్లాడుతూ..'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా నా వ్యక్తిగత అభిప్రాయాన్ని రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు మీడియా ద్వారా తెలియజేస్తున్నా.

2లో..

## హామీల అమలుకు తగ్గట్లుగా బడ్జెట్



- వాస్తవాలకు దగ్గరగా నిధుల కేటాయింపు
- అధికారంలోకి వచ్చి 800 రోజులైనా దిక్కులేదు
- ఎన్నికల ముందు రాసిచ్చిన బాండ్ పేపర్ల గతేమయ్యింది
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

2లో

## పోలీస్ క్రీడలు

### ప్రారంభించిన మంత్రి అనిత

పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని వెల్లడి




అమరావతిలోని మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీఎస్పీ వేదికగా జరిగిన రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజా భద్రత కోసం 24 గంటలు శ్రమించే మన పోలీసు సోదరులకు మానసిక ఉల్లాసం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమారు 6 రాష్ట్రాల నుండి వచ్చిన 10 జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్న తరుణంలో, ఇలాంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు ఇక్కడ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది.

## అమరావతి క్వాంటం వ్యాలీగా అభివృద్ధికి అడుగులు

- ఆంధ్రప్రదేశ్ లో ఏఐ, క్వాంటం ఎకో సిస్టం కోసం ఏడు కీలక ఒప్పందాలు
- నైపుణ్య శిక్షణ, మౌలిక సదుపాయాలపై ఒప్పందాలు
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో ఎంఓయులు
- లక్ష మంది యువతకు ఐబీఎం ద్వారా సాంకేతిక శిక్షణ
- అమరావతిలో ఏఐ, క్వాంటం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- దక్షిణ భారతదేశంలోనే తొలి ఏఐ క్వాంటం యూనివర్సిటీ




ఆంధ్రప్రదేశ్ ను భవిష్యత్ టెక్నాలజీ రంగంలో ఛాంపియన్ గా నిలిపేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతిని క్వాంటం వ్యాలీగా అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో కుదుర్చుకున్న ఈ ఒప్పందాలు సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగాయి. ఏపీలో క్వాంటం, ఏఐ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన దిశగా ఇవి ఉపయోగపడనున్నాయి. అమరావతిలోని క్వాంటం వ్యాలీకి అంతర్జాతీయ గుర్తింపు తేవడానికి, ఎకో సిస్టం పెంపొందించడానికి ఈ ఒప్పందాలు బాటలు వేయనున్నాయి. క్వాంటం,

మిగతాది 2లో

## స్మగ్లర్ల ఆగడాలు అరికట్టేందుకు

- ఎక్సైజ్ శాఖ సిబ్బందికి ఆయుధాలు
- ప్రభుత్వం పరిశీలిస్తోందన్న మంత్రి జూపల్లి




స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి,

2లో

## కర్రెగుట్టలో పేలిన మందుపాతర.. !

ములుగు:

మావోయిస్టుల వేరివేతలో భాగంగా కగార్ ఆపరేషన్-2 చేపట్టిన సీఆర్పీఎఫ్‌కు భారీ ప్రమాదం తప్పింది. కర్రెగుట్టలో కగార్-2 ఆపరేషన్‌లో భాగంగా మందుపాతర పేలింది. కర్రెగుట్టలో అమర్చిఉన్న మందుపాతరపై ఓ జవాన్ కాలి వేయడంతో అది ఒక్కసారిగా పేలింది. దాంతో తీవ్ర గాయాలైన జవాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

2లో..



## కవిత కొత్త పార్టీ పేరు ఇదే..?

పసుపు, ఎరుపు రంగులతో పార్టీ జెండా?



మిగతాది 2లో

### కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై ఫోకస్

ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని,

## రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన రోజు

ఎక్స్ వేదికగా హరీష్ రావు పోస్ట్



మిగతాది 2లో

భారతీయ తెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
శనివారం ఫిబ్రవరి 21, 2026

# సంపాదకీయం

## రెక్కలు విరిగిన విద్యార్థి విప్లవాలు

నిన్న బంగ్లాదేశ్‌లో, మొన్న మయన్మార్‌లో ముగిసిన, మరో పక్షం రోజుల్లో నేపాల్‌లో జరగనున్న పార్లమెంటరీ ఎన్నికలు దక్షిణాసియా రాజకీయ మనఃస్థితిని నిర్దేశిస్తున్నాయి. ఈ మూడు పార్లమెంటరీ ఎన్నికలు కేవలం ప్రజాస్వామిక పరివర్తనలు మాత్రమే కాదు, అవి విద్యార్థుల తిరుగుబాటుతో సుదీర్ఘంగా కొనసాగిన రాజకీయ అల్లకల్లోల పరిస్థితుల నుంచి పర్యవసించిన చరిత్రాత్మక సంఘటనలు.

బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ ఛాత్ర శిబిర్, జాతీయోబాదీ ఛాత్రదళ్ నాయకత్వంలో యువజనులు షేక్ హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన తిరుగుబాటులో యువనేతలు నహీద్ ఇస్లాం, సర్జిస్ ఆలం కీలకపాత్ర వహించారు. మయన్మార్‌లో సైనిక ప్రభుత్వాన్ని శాసనోల్లంఘన ఉద్యమం ద్వారా ప్రతిఘటించడంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు అగ్రగాములుగా నిలబడ్డారు. ప్రజాస్వామ్య అనుకూల శక్తులు అయిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీతోను, నేషనల్ యూనిటీ గవర్నమెంట్ లోని ప్రజాస్వామ్యవాదులతోను విద్యార్థులు కలసికట్టుగా, 2021లో కుట్రతో అధికారాన్ని కైవసం చేసుకున్న సైనికాధికారులను తీవ్రంగా వ్యతిరేకించారు.

నేపాల్‌లో ఉవ్వెత్తున ఎగసిన జెన్--జీ యువజనుల నిరసనలు ప్రభుత్వ వ్యవస్థలోను, సమాజంలోను పెచ్చరిల్లిపోయిన అవినీతిని ప్రతిఘటించి, నిర్మూలించడమే లక్ష్యంగా జరిగాయి. 2008 అనంతరం నేపాల్ రాజకీయాలలో చరిత్ర తిరస్కృతికి గురైన రాజరిక కాలం నాటి కులీన వర్గాలే మళ్లీ పెత్తందారులు కావడాన్ని జెన్--జీ తరం సహించలేకపోయింది. నేపాల్ చరిత్రాత్మక ఉద్యమాల (1990 జన్ ఆందోళన్, 2006 పీపుల్స్ మూవ్‌మెంట్ మొదలైనవి) వలే కాకుండా జెన్--జీ యువజనుల సమీకరణ చాలా నిష్పాక్షికంగా జరిగింది. సామాజిక మాధ్యమాల ద్వారా అపూర్వరీతిలో జెన్--జీ నిరసనకారుల మధ్య సమన్వయం సాధ్యమయింది. రాబోయే ఎన్నికలలో సంప్రదాయ రాజకీయవర్గాలను వ్యతిరేకిస్తున్న శక్తులను పటిష్ఠపరచడంలో యువ ఉద్యమకారులు తీవ్ర కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా 2022లో ఖాట్మండ్ మేయర్ పదవికి ఎన్నికైన స్వతంత్ర అభ్యర్థి బాలెన్ షాకు పూర్తి మద్దతునిస్తున్నారు. సంప్రదాయేతర రాజకీయ శక్తుల వైపు జెన్--జీ మొగ్గు చూపుతోందనడానికి ఇది స్పష్టమైన తార్కాణం. అయితే నేపాల్‌లో జెన్--జీ నిరసనకారులు దేశవ్యాప్త యువజన పార్టీగా సంఘటితం కాలేదు.

ఈ మూడు దేశాల-- బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్-- లోను యువజనుల నిరసనలు, ఉద్యమాల తరువాతనే ఎన్నికలు జరగడం గమనార్హం. రాజకీయ మార్పులను సాధించడంలో విద్యార్థి ఉద్యమాల ప్రభావశీలతను అది ధ్రువీకరిస్తోంది. ఈ విద్యార్థి ఉద్యమాలు ప్రభుత్వాలను కూల్చివేయడంలో విజయవంతమవుతున్నాయి, సందేహం లేదు. కొత్త పాలకులను ఎన్నుకునేందుకు ఎన్నికల నిర్వహణను అనివార్యం చేయగలుగుతున్నాయి. తీరా ఎన్నికల అనంతరం అధికార వ్యవస్థలను కైవసం చేసుకుంటున్నది మాత్రం సువ్యవస్థిత పార్టీలు, సంప్రదాయ రాజకీయ శక్తులే కావడం విస్మరించలేని వాస్తవం.

విద్యార్థి ఉద్యమాల ప్రభావశీలతకు, వాటి రాజకీయ లక్ష్యాల సాధనకు మధ్య ఉన్న అంతరానికి నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ) ఒక తాజా ఉదాహరణ. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల తిరుగుబాటు నుంచి ప్రభవించిన ఈ పార్టీ కన్వీనర్ నహీద్ ఇస్లాం ఇటీవలి పార్లమెంటరీ ఎన్నికలలో ఢాకా నుంచి విజయం సాధించారు. ఢాకాతో పాటు కేవలం అయిదు స్థానాలలో మాత్రమే ఎన్‌సీపీ విజయం సాధించింది. ఈ యువ విప్లవకారులు ఒక సంఘటిత రాజకీయశక్తిగా ఎందుకు ప్రభవించలేకపోయారు? హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారి పోరాటం ఒక తరం మార్పుకు ఆరంభంగా కనిపించింది. అయితే అది ఆరంభంగానే మిగిలిపోయింది. ఎన్నికల పోరాటంలో సంపూర్ణ విజయంగా పర్యవసించలేదు.. బంగ్లా విద్యార్థుల పోరాటం సువ్యవస్థిత పాలక వర్గాలను కదిలించి వేసింది. అయితే వారిని పూర్తిగా రంగం నుంచి తొలగించలేకపోయింది. తారీఖ్ రెహ్మాన్ నాయకత్వంలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ మళ్లీ ఢాకాలో అధికారానికి వచ్చింది. బంగ్లా సంప్రదాయ పాలక పార్టీలలో అది ఒకటి. మౌలికంగా ప్రగతిశీల కొత్త శక్తులేవీ అధికారానికి రాలేదు.

ఇటీవలే ముగిసిన మయన్మార్ ఎన్నికలలో కూడా ఇటువంటి పరిణామాలే చోటుచేసుకున్నాయి. సైన్యం మద్దతు ఉన్న యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యూఎస్‌డీపీ) నిర్ణయాత్మక విజయం సాధించింది. విద్యార్థుల క్రియాశీలత పార్లమెంటరీ పోరాట పద్ధతులుగా పరిణమించలేదు. చారిత్రకంగా మయన్మార్‌లో ప్రభావశీల పౌర రాజకీయ శక్తి నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ. కుట్రతో అధికారంలోకి వచ్చిన సైనికాధికారులు ఆ ప్రజాస్వామిక సంస్థను పూర్తిగా అణచివేశారు. ఆంగ్‌సాన్ సూకీపైనే ఆధారపడి ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని అభివృద్ధి పరచుకోవడంలో ఎన్‌ఎల్‌డీ విఫలమవడం కూడా దాని అణచివేతకు దారితీసింది. సూకీ అధికారంలోకి వచ్చిన తరువాత, 1988 విప్లవంలో ప్రముఖ పాత్ర వహించిన విద్యార్థినాయకులు ఎవరినీ ఆమె ఏ విధంగానూ ప్రోత్సహించలేదు.

విద్యార్థి ఉద్యమాలు విశాల సమాజం నుంచి సంపూర్ణ మద్దతును పొందుతున్నాయి. రాజకీయ, పాలనా వ్యవస్థల్లో మౌలిక మార్పులపట్ల విస్తృత స్థాయిలో ఆశాభావాలను నెలకొల్పుతున్నాయి. విశ్వవిద్యాలయాలు చైతన్యశీల భావాలకు నెలవులు. అక్కడి విద్యార్థి లోకంలో భావవ్యాప్తి శీఘ్రగతిన జరగడం పరిపాటి. వ్యవస్థలను ప్రతిఘటించడంలో ముందుండడమే కాకుండా, ఆ కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే ఎలాంటి చిక్కులనైనా ఎదుర్కోవడానికి వారు సాహసిస్తారు. ఆ సాహస గుణం వల్లే విద్యార్థి ఉద్యమాలు ప్రభావదాయకమూ, సంచలనాత్మకమూ అవుతున్నాయి.

నేపాల్ పార్లమెంటుకు త్వరలో జరగనున్న ఎన్నికలు భారత్‌తో సహా ఇరుగు పొరుగు దేశాలనే కాకుండా అంతర్జాతీయ సమాజం దృష్టిని కూడా విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మున్నెన్నడూ లేని రీతిలో జెన్--జీ నిరసనలు ప్రజ్వరిల్లడమే అందుకు ప్రధాన కారణం. ఆ ఉద్యమానికి చెప్పదగ్గ ప్రభావశీల నాయకులు ఎవరూ లేరు. ఆ ఉద్యమం చాలావరకు వికేంద్రీకృతంగా జరిగింది.

## కర్రెగుట్టలో పేలినమందుపాతర..!

మొదటిపేజీ తరువాయి
గాయపడ్డ జవాన్‌ను హెలికాప్టర్‌లో హుటాహుటీనా ఆస్పత్రికి తరలించారు.
సెర్చ్ ఆపరేషన్ చేస్తుండగా మందుపాతర పేలింది. ఈ ఘటనలో 39 బెటాలియన్‌కు చెందిన జవాన్ గాయపడ్డారు. గాయపడ్డ జవాన్‌ను నవజీత్ పటాకుగా గుర్తించారు. ఈరోజు(గురువారం, ఫిబ్రవరి 20వ తేదీ) ఉదయం నుంచి 11 ఐఈడీ(మందుపాతరలు) లను గుర్తించి నిర్వీర్యం చేశాయి సీఆర్పీఎఫ్ బృందాలు.
కాగా, తెలంగాణ--ఛత్తీస్‌గడ్ సరిహద్దు ప్రాంతంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో నిన్న(గురువారం, ఫిబ్రవరి 19వ తేదీ)భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అగ్రనేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఐదుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా, అందులో కీలక నేతలు ఉన్నట్లు సమాచారం. మృతిచెందిన వారిలో అగ్రనేత దేవ్‌జీ ఉన్నట్లు తెలుస్తోంది.
కర్రెగుట్టలో ఆపరేషన్-2లో భాగంగా 5 వేల మంది సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూంబింగ్ చేపట్టారు. మావోయిస్ట్ అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్-2 కగార్ సాగుతోంది. మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, సోది కోసం కూంబింగ్ చేపట్టగా.. మరో వైపు లొంగుబాటుకు అగ్రనేతలు సిద్ధమవుతున్నారు. ఇంకా 40 రోజులే ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్ మిగిలి ఉంది.

## జీవన్‌రెడ్డికి తగిన గౌరవమివ్వండి: జగ్గారెడ్డి

మొదటిపేజీ తరువాయి
జీవన్ రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయారు. కాంగ్రెస్ పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పార్టీ లోనే ఉన్నాడు. రాజకీయంగా జీవన్ రెడ్డికి ఎన్నో ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌తోనే ఉన్నారు. కష్ట కాలంలో పార్టీలో ఉన్న జీవన్ రెడ్డికి అవమానం జరగకుండా కాంగ్రెస్ పెద్దలు చొరవ చూపాలి. జీవన్ రెడ్డికి గౌరవం వచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారిని కోరుతున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు.
ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో, జీవన్‌రెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఫుడ్ పాయిజన్ అయిందని జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నట్టు సమాచారం.

## స్మగ్లర్ల ఆగడాలు అరికట్టేందుకు

మొదటిపేజీ తరువాయి
తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణెళి లక్ష్యం కావాలని ఆశాభావం వ్యక్తం
చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలుకు తగ్గట్లుగా బడ్జెట్

మొదటిపేజీ తరువాయి
సిద్దిపేట,: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్‌ను తయారు చేయాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో




ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియా, రాహుల్ రాసిచ్చిన బాండ్ పేపర్లు ఏమాయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 800 రోజులైనా ఒక్క హామీకి దిక్కులేదని, గెలిచిన నెలకే వృద్ధులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ. 4000 పెన్షన్ అన్నారు. 27 నెలలైనా రాలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నిధులు పెడతారా, లేదా? అంటూ ప్రశ్నించారు. నెలకు రూ. 2500 ఇస్తామని ఆశచూపి మహిళల ఓట్లు దండుకున్నారు. ఒక్కరికైనా రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. వెంటనే బ్జడెట్‌లో మహిళలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఎగ్గొట్టారని, రాజీవ్ యువ వికాసం అంతా బూటకమని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన ఎస్సీ, బీసీ, రైతు డిక్లరేషన్లన్నీ ఉత్త మాటలే. అసెంబ్లీలో మాయ మాటలు మాని, వాస్తవ బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకిచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10వేలు, ఇంటర్ పాస్ అయితే రూ. 25 వేలు, డిగ్రీకి రూ. 50వేలు, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి, ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20 వేలు కోట్ల బ్జడెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపిందని విమర్శించారు . వరంగల్ సభలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ అని చెప్పి మాయమాటలు చెప్పారని, ఏటా రూ. 15వేలు రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందని పేర్కొన్నారు. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు చేయగా కాంగ్రెస్ రూ. 4వేలు ఇస్తామని హామీ ఇప్పటి వరకు నెరవేర లేదని అన్నారు. ఈనెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత , చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4వేలు పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్జడెట్‌లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌నైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని, రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా బ్జడెట్‌లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

## సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

మొదటిపేజీ తరువాయి
ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశర చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## అమరావతి క్వాంటం వ్యాలీగా అభివృద్ధికి అడుగులు

మొదటిపేజీ తరువాయి
ఏఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ తో ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది చివరి నాటికి అమరావతిలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఐబీఎంతో జరిగిన ఒప్పందం ద్వారా లక్ష మంది యువతకు క్వాంటం, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో శిక్షణ ఇవ్వనున్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ సహకారంతో దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి ఏఐ, క్వాంటం డీమ్డ్ యూనివర్సిటీని స్థాపించనున్నారు. దీనికి అవసరమైన భూమి, హార్డ్‌వేర్ ను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చగా, కేంద్రం నిధులు కేటాయిస్తుంది.
రాష్ట్ర స్థాయి ఏఐ టెక్ హబ్ నిర్మాణం కోసం భారత్ జెన్, నెక్స్ జెన్, ఐబీఎంతో ఒప్పందం కుదిరింది. ఇది 22 భారతీయ భాషలను అనుసంధానించే ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుంది. కాలిబో ఏఐ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా 50 ఉన్నత విద్యా సంస్థల్లో ఏఐ అకాడెమీ, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటు చేయనున్నారు.

## రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన రోజు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్,: రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది నేటికి 12 ఏళ్ల అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ చేశారు. బిల్ ఈజ్ పాస్డ్ అన్న టైటిల్‌తో ఓ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన క్రమాన్ని తన పోస్టులో ఆయన వెల్లడించారు. 2014, ఫిబ్రవరి 20వ తేదీన తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కినట్లు చెప్పారు. శాంతియుతంగా సాగిన స్వరాష్ట్ర ఉద్యమానికి సంకేత సూచకంగా బిల్లు పాసైనట్లు హరీశ్ రావు తన పోస్టులో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైనట్లు చెప్పారు. కేసీఆర్‌తో కలిసి విక్టరీ సంకేతం చేస్తున్న ఫోటోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కొన్ని దశాబ్దాల త్యాగం, పోరాటం, ఆత్మగౌరవం.. చివరకు కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు హరీశ్ తన ఎక్స్‌లో తెలిపారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అన్నారు.

## కవిత కొత్త పార్టీ పేరు ఇదే..?

మొదటిపేజీ తరువాయి
పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు. ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది. కవిత తన పార్టీ పేరును ఖాజీూ గా నిర్ణయించినట్లు తెలుస్తోంది.
తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం చేసినట్లుగా సమాచారం. తన పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పిన కవిత.. అన్నట్లుగానే ఇప్పుడున్న తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చేస్తూ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నిర్ణయించారని తెలుస్తోంది. కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో నడుస్తున్న చర్చ.ఇక పార్టీ గుర్తుగా కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై కవిత ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేట, బోధన్.. ఈ రెండు చోట్ల నుంచి కవిత బరిలోకి దిగుతారనే టాక్ వినిపిస్తోంది.

## 'సర్' విధుల్లో జ్యుడిషియల్ అధికారులు.. సుప్రీం అసాధారణ నిర్ణయం

మొదటిపేజీ తరువాయి
పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మధ్య నిందల పర్వం కొనసాగుతోందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇది దురదృష్టకర పరిణామమని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా అసాధారణ నిర్ణయం తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం.. ఈ ప్రక్రియలో సాయం చేసేందుకు జ్యుడిషియల్ అధికారులను నియమించాలని హైకోర్టును ఆదేశించింది. ఎస్ఐఆర్ దరఖాస్తులపై వచ్చే అభ్యంతరాలను ఈ అధికారులు పరిశీలిస్తారని స్పష్టం చేసింది.
రాష్ట్రంలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ పరిశీలనకు గ్రేడ్ ఏ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరును ప్రస్తావిస్తూ.. "రెండు రాజ్యాంగబద్ధ విభాగాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగుతుండటం దురదృష్టకర పరిణామం. ఇది వ్యవస్థల మధ్య అపనమ్మకాన్ని రుజువు చేస్తోంది. అభ్యంతరాల స్వీకరణ దశలో ఈ ప్రక్రియ ఆగిపోయింది" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే 'సర్' ప్రక్రియ కోసం జ్యుడిషియల్ అధికారులతోపాటు మాజీ న్యాయమూర్తుల సాయం తీసుకోవాలని, సంబంధిత అధికారులను నియమించుకోవాలంటూ కలకత్తా హైకోర్టుకు ఆదేశాలు జారీ చేసింది.

# గురుకుల పాఠశాలలో కరెంట్ షాక్ తగిలి వ్యక్తి మృతి.

**భారతీయ వెలుగు / ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా /బుచ్చి ఫిబ్రవరి20.**



బుచ్చి(మం) రామచంద్రపురం గురుకుల పాఠశాలలో కరెంటు షాక్ తగిలి ఓ కూలి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పాఠశాల ప్రహరీపై ఇనుప ముల్ల కంచె ఏర్పాటు చేస్తుండగా నెల్లూరుకు చెందిన ఓ కూలి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురయ్యాడు. వెంటనే బుచ్చిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కాలుష్యంతో నిండిన గోదావరి నది - డస్ట్ బిన్ మాదిరి పంట కాలువలు: ఎమ్మెల్యే నల్లమిల్లి

» గంగా నది తరహాలో శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే విజ్ఞప్తి

**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి/అమరావతి):**
అసెంబ్లీ సమావేశంలో ఇప్పటికే పలు సమస్యల పై గళమ్ విప్పిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం గోదావరి నది కాలుష్యం, గోదావరి పుష్కరాలు పై పలు విషయాలు ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.అనపర్తి నియోజకవర్గం నుండి ఇప్పటి వరకు ఎన్నికైన ఎమ్మెల్యేలతో పోలిస్తే ఎక్కువ సమయం మాట్లాడిన ఘనత,అనేక సమస్యలు అసెంబ్లీ సమావేశం ద్వారా తీసుకెళ్లిన ఎమ్మెల్యే గా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కే దక్కుతోందని చెప్పవచ్చు.కాగా అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ భారతదేశంలో గంగా నది తర్వాత గోదావరి నది అత్యంత పవిత్రమైనదని ఆరు రాష్ట్రాల మీదుగా గోదావరి నది ప్రవహిస్తున్నప్పటికీ రాజమహేంద్రవరం దగ్గర అఖండ గోదావరిగా పిలుస్తామని అన్నారు.వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు జరగనున్నాయని అయితే గోదావరి నదిలో విపరీతమైన కాలుష్యం పేరుకుపోవడం జరుగుతుందని ముఖ్యంగా ఏపీ పేపర్ మిల్స్ కాలుష్యం ఎడమ గట్టు, ఆంధ్ర షుగర్స్




కాలుష్యం కుడి గట్టు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ సీవరేజ్ అంతా అక్కడ కలుస్తూ ఉండటంతో విపరీతమైన కాలుష్యం ఏర్పడి కనీసం అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొందని సమావేశంలో తెలిపారు. ఎన్ఆర్సిపి ప్లాన్ కింద కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ పనులు పూర్తి చేయమని 88 కోట్ల కేటాయిస్తే నేటికీ ఆ పనులు పూర్తి కాలేదని తెలిపారు. గోదావరి పంట కాలువలు కూడా ఒక టెస్ట్ బిల్లు మాదిరిగా తయారయ్యాయని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు చెత్త తీసుకొచ్చి కాలువలో వేయడం కాలువల్లో కాట్స్, పరుపులు బయటికి తీసిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. గోదావరి నదిని శాశ్వతంగా పొల్యూషన్ నుండి కాపాడుకోవాలని సూచించారు. గంగా నది తరహాలో గోదావరి నదికి కూడా శాశ్వత పరిష్కారం కలిపించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయవలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. కాలుష్య మండలి గోదావరి నీటి నాణ్యతను కాపాడుతున్నామని నేషనల్ వాటర్ మానిటరింగ్ ప్రోగ్రాం ఆన్ మంత్లీ అని చెప్తున్నా అవి నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. మంత్రి పవన్ కళ్యాణ్ కాలుష్య నివారణ కోసం ఒక బ్రాండ్ అంబాసిడర్ గా ఒక పిలుపునిస్తే ఆయన అభిమానులు, ప్రజలు ఆయన మాట పాటించే విధంగా జరుగుతోందని దీనిని దృష్టిలో ఉంచుకొని పవన్ కళ్యాణ్ బ్రాండ్ అంబాసిడర్ గా ఉండి గోదావరి పరిరక్షణ, గోదావరి కాలువల పరిరక్షణ కోసం కృషి చేయమని ఎమ్మెల్యే నల్లమిల్లి కోరారు. పుష్కరాల కోసం మాత్రమే కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా కాలుష్య నివారణకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఏపీ పేపర్ మిల్స్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనలు ఏమాత్రం పాటించదని కనీసం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కి చెల్లించాల్సిన టాక్స్ కూడా చెల్లించరని శాసనసభ సమావేశంలో పేర్కొన్నారు. ఇవన్నీ గమనించి మంత్రి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం.




**భారతీయ వెలుగు/ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా/ ఫిబ్రవరి 20.**
జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన అందించే ఈ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25, 2025-26 సంవత్సరంలో నిరవధికంగా చదివి ఉండాలని తెలిపారు. ఈ నెల 23 నుంచి మార్చి 31వ తేదీలోపు గేట్ వే ద్వారా ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు.

# సూపర్ సిక్స్ హామీల అమలు శూన్యం:నందిక ప్రమీల

- చర్చకు మేం సిద్ధం-బకాయిలు చెల్లించేందుకు సిద్ధం కండి

**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి):**
ఎన్నికల ముందు మహిళా శక్తి పేరుతో ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాల్లో ముఖ్యమైన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు చేయలేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు నందిక ప్రమీల విమర్శించారు. శుక్రవారం ప్రమీల మాట్లాడుతూ అనపర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పై టిడిపి మహిళా నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు ప్రతి మహిళకు నెలకు రూ1500 ఆడబిడ్డ నీది ఇస్తామని ఇంతవరకు ఒక్క



రూపాయి కూడా జమ చేయలేదని విమర్శించారు. ఇప్పటికే ప్రతి మహిళకు రూ.30 వేలు, ప్రతి నిరుద్యోగికి రూ.60 వేలు బకాయి పడ్డారని ప్రమీల తెలిపారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వారికి నెలకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని ఆ హామీ కూడా నెరవేర్చలేదని రూ.80 వేలు బకాయి పడ్డారని ప్రమీల తెలిపారు. మహిళా శక్తి పేరుతో ఓట్లు సాధించి అదే మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ప్రమీల ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడ లో అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డకు పెన్షన్ ఇప్పించలేక పోయిన కూటమి నేతలు సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు కోల్పోయారని ప్రమీల మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులకు సూపర్ సిక్స్ పథకాల బకాయిలు చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని ఏ గ్రామం నుండి ఏ తేదీన ఇంటింటికి వెళ్దామో మీరే నిర్ణయించండని ఆమె అన్నారు. ప్రజల తరపున పోరాడే నాయకుడు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అని చర్చకు మా నాయకుడు రానవసరం లేదని మా స్థాయిలోనే చర్చకు సిద్ధమని సంకల్పం ఉంటే రండి లేకపోతే మహిళా శక్తి మాట వట్టి నినాదం అని ప్రజలు తీర్పు చెపుతారని ప్రమీల పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెదపూడి మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కడియాలు భూలక్ష్మి,రాజుపాలెం, పెద్దాడ సర్పంచులు గుత్తుల పుష్పావతి,డోకుబుర్ర మీనాక్షి ఉన్నారు.

# అఫ్జల్‌గంజ్ ఇన్స్ పెక్టర్ మోహన్ రావు కు సత్కారం




**భారతీయ వెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**
అఫ్జల్‌గంజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా కె. మోహన్ రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ ఆర్ లక్ష్మణ్ రావు నేతృత్వంలో పలువురు ప్రముఖులు ఇన్ స్పెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మోహన్ రావు ను శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి లక్ష్మణ్ రావు అభినందించారు. ఇన్ స్పెక్టర్ నేతృత్వంలో అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని మరియు ప్రజా భద్రత అత్యంత ప్రాధాన్యతగా ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన సభ్యులు మరియు స్థానిక శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# ఘనంగా కింగ్ స్టన్ ఆస్పత్రి 4వ వార్షికోత్సవ వేడుకలు

**- ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యం పొందాలి**
**- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్**

**భారతీయ వెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 20:**
ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై అవగాహన పెంపొందించుకొని ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజరుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ లోని కింగ్ స్టన్ ఆస్పత్రి 4వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా.. 'ఊపిరితిత్తుల ఆరోగ్యం -సంరక్షణ -నివారణ' పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తారేక్ అన్సారి, డాక్టర్ ఆశిష్ చౌహాన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు, మెడికల్ డైరెక్టర్, డాక్టర్ మహమ్మద్ ఫైసల్, రెవరెండ్ బ్రదర్ జాన్, ప్రఖ్యాత ఆర్థికవేత్త, డాక్టర్ అమీరుల్లా తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా




ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అజరుద్దీన్ మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, వాటి వల్ల శరీరంలో ఇతర అవయవాలకు పొంచి ఉన్న ప్రమాదాలపై రోగులకు అవగాహన కల్పించేందుకు కింగ్ స్టన్ ఆస్పత్రి ముందుకు రావడం సంతోషకర విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ నిజజీవితంలో తమ శరీరంలో అత్యంత కీలకమైన సున్నితమైన ఊపిరితిత్తులను నిర్లక్ష్యం చేయకుండా, తమకు తామే సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. శారీరిక శ్రమతో పాటు ప్రతి ఒక్కరూ, ప్రతిరోజు సుమారు అరగంట పాటు వ్యాయామం చేయాలని ఆయన తెలిపారు.

ముఖ్యంగా ధూమపానం వల్ల ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని ఆరోగ్యకరమైన, ఊపిరితిత్తుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అనంతరం,, కింగ్సన్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, డాక్టర్ మహ్మద్ ఫైసల్ మాట్లాడుతూ,,,, తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో, కమ్యూనిటీ స్క్రీనింగ్ క్యాంపులు, సిపిఆర్ పై శిక్షణ, వర్క్ షాపులు, పాఠశాల కళాశాల విద్యార్థులకు, ఊపిరితిత్తుల సంరక్షణ పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు, తమ ఆసుపత్రి 4, వ వార్షికోత్సవం సందర్భంగా ఊపిరితిత్తుల ఇన్స్ పైర్ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కింగ్ స్టన్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డుల సరిహద్దుల మార్పుపై ఉన్నత న్యాయస్థానం జోక్యం ప్రజాస్వామ్యానికి బలం- భరోసా పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ - జిలానీ

**భారతీయ వెలుగు / హైదరాబాద్: 20**



ఏప్రిల్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ వార్డుల పునర్విభజన ప్రక్రియ చుట్టూ ఏర్పడిన వివాదాలు మరియు ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని ప్రభుత్వానికి వివరణ కోరడం ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా ఒక కీలక పరిణామం. వార్డుల పునర్విభజన అనేది కేవలం పరిపాలనా చర్య మాత్రమే కాదు. ఇది ఓటర్ల ప్రతినిధిత్వం, రిజర్వేషన్ల విధానం, వార్డు సరిహద్దులు మరియు భవిష్యత్తు స్థానిక పాలనపై ప్రత్యక్ష ప్రభావం చూపే సున్నితమైన అంశం. అందువల్ల ఈ ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధంగా, పారదర్శకంగా మరియు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ జరగాలి. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచి, న్యాయస్థానం మార్గదర్శకాలను గౌరవిస్తూ ముందుకు సాగాలి. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత. హైదరాబాద్ నగర ప్రజల హక్కులు, సమాన ప్రతినిధిత్వం మరియు న్యాయం అన్నింటికంటే ముఖ్యమైనవనీ భరోసా పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్ జీలాని ఒక ప్రకటనలో తెలిపారు.

# నిజాంపేట వెంకట సాయి హోమ్స్‌లో ఘనంగా లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ట...

**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:**
కుత్బుల్లాపూర్ సర్కిల్ నిజాంపేట లో వెంకట సాయి హోమ్స్‌లో శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం 5 గంటల నుంచి శాస్త్రోక్తంగా హోమం,శివ పార్వతుల కళ్యాణం,గోమాత పూజ,అన్నసమారాధన నిర్వహించారు. అలాగే సాయంత్రం స్వామివారి పల్లకీ సేవలో ఉత్సవ మూర్తులను కాలనీలోని అన్ని వీధుల్లో ఊరేగింపుతో పాటు భక్తి శ్రద్ధలతో కోలాటం, ఆట పాటల నృత్యాలతో సంబురంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలనుంచి కాలనీ వాసులు కుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో పూజలో పాల్గొని తమ ఇష్ట దైవానికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి వివిధ రకాల బంగారు



ఆభరణాలతో అలంకరణ చేయడంతో పాటు స్వామివారిని పట్టు వస్త్రాలను ధరింపచేసి వేద పండితుల ఆశీర్వాదాల



మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వెంకట సాయి హోమ్స్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, ఆహ్వానితులు తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని అక్కడికక్కడే వ్యక్తి మృతి

**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి):**



మోటార్ సైకిల్ పై వెళుతున్న సబ్బెళ్ళ వీర ప్రకాశ్ రెడ్డి(26)ని వెనుక వైపు నుండి వచ్చి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని అనపర్తి ఎస్ ఐ శ్రీను నాయక్ తెలిపారు. శుక్రవారం ఎస్ఐ మాట్లాడుతూ గురువారం వీర ప్రకాశ్ రెడ్డి మోటారు సైకిల్ పై అనపర్తి సెంటర్ లోకి వచ్చి తిరిగి నల్ల కాలువ వైపు వెళుతుండగా ఏపీ 39 యుడి 5468 లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి వెనుక నుండి ఢీకొట్టడంతో టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని చెప్పారు.కేసు నమోదు చేసి ముద్దాయిని అదుపులోకి తీసుకుని,లారీ సీజ్ చేయడం జరిగిందని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ శ్రీను నాయక్ వెల్లడించారు.

# కూకట్పల్లి పద్మావతి ప్లాజాలో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు

**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని పద్మావతి ప్లాజాలో మహారాష్ట్ర వీరపుత్రుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు




ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళ్యాణి శివ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.ముందుగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశభక్తి నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మారుమోగింది. శివాజీ మహారాజ్ చూపిన ధైర్యసాహసాలు, పరిపాలనా నైపుణ్యం, స్వాభిమాన భావం గురించి పలువురు ప్రసంగించారు. యువతలో దేశభక్తి, స్వాభిమాన స్ఫూర్తిని నూరిపోసే మహనీయుడిగా శివాజీ మహారాజ్ నిలిచారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయన జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవ, భాస్కర్ తొట, శ్రీపతి, రాజేష్, హర్ష శ్రీ, సచిన్, వెంకట్, శివ బాబు, రాజా కుమార్, భారత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ హామీల అమలు శూన్యం:నందిక ప్రమీల

## » చర్చకు మేం సిద్ధం-బకాయిలు చెల్లించేందుకు సిద్ధం కండి





**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి):**
ఎన్నికల ముందు మహిళా శక్తి పేరుతో ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాల్లో ముఖ్యమైన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు చేయలేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు నందిక ప్రమీల విమర్శించారు. శుక్రవారం ప్రమీల మాట్లాడుతూ అనపర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పై టిడిపి మహిళా నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు ప్రతి మహిళకు నెలకు రూ1500 ఆడబిడ్డ నీది ఇస్తామని ఇంతవరకు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని విమర్శించారు. ఇప్పటికే ప్రతి మహిళకు రూ.30 వేలు, ప్రతి నిరుద్యోగికి రూ.60 వేలు బకాయి పడ్డారని ప్రమీల తెలిపారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వారికి నెలకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని ఆ హామీ కూడా నెరవేర్చలేదని రూ.80 వేలు బకాయి పడ్డారని ప్రమీల తెలిపారు. మహిళా శక్తి పేరుతో ఓట్లు సాధించి అదే మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ప్రమీల ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడ లో అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డకు పెన్షన్ ఇప్పించలేక పోయిన కూటమి నేతలు సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు కోల్పోయారని ప్రమీల మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులకు సూపర్ సిక్స్ పథకాల బకాయిలు చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని ఏ గ్రామం నుండి ఏ తేదీన ఇంటింటికి వెళ్దామో మీరే నిర్ణయించండని ఆమె అన్నారు. ప్రజల తరపున పోరాడే నాయకుడు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అని చర్చకు మా నాయకుడు రానవసరం లేదని మా స్థాయిలోనే చర్చకు సిద్ధమని సంకల్పం ఉంటే రండి లేకపోతే మహిళా శక్తి మాట వట్టి నినాదం అని ప్రజలు తీర్పు చెపుతారని ప్రమీల పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెదపూడి మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కడియాలు భూలక్ష్మి,రాజుపాలెం, పెద్దాడ సర్పంచులు గుత్తుల పుష్పావతి,డోకుబుర్ర మీనాక్షి ఉన్నారు.

# ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బొట్టు విష్ణు...

**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన సందర్భంగా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ యస్.స్సి విభాగ అధ్యక్షులు బొట్టు విష్ణు ఆధ్వర్యంలో కూకట్ పల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వైస్ జంక్షన్ గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసిన కూకట్పల్లి నియోజకవర్గ యస్.స్సి విభాగ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎడ్ల ప్రభాకర్. కళ్ళెం శంకర్. బొట్టు నాగరాజు. ఎడ్ల సత్యనారాయణ. ఎడ్ల కవిత. శారద. గిరి సాగర్. పుట్టపాక మధు. రత్నం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాఘవేంద్ర హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం తన మిత్రులు రామకృష్ణ మహేష్‌ల ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి 'వై' జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రాఘవేంద్ర హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆహ్వానాన్ని మన్నించి పాల్గొన్నందుకు రాఘవేంద్ర హోటల్స్ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించే విధంగా ఇలాంటి వ్యాపారాలు అభివృద్ధి చెందాలని, శ్రీ రాఘవేంద్ర హోటల్ ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తూ మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆకాంక్షించారు.

# శ్రీ అభయాంజనేయ సమేత కోదండరామ స్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్టకు రావలసిందిగా వడ్డేపల్లి రాజేశ్వరరావుకి ఆహ్వానం...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి సమేత కోదండరామస్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి రావలసిందిగా ఆహ్వానిస్తూ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఆలయ పునః నిర్మాణానికి సహకరించి సహాయ సహకారాలు అందించినందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు వడ్డేపల్లికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నిర్వాకులు జి సంజీవరెడ్డి, చలపతిరావు, ఆస్కానీ వెంకటస్వామి సాగర్, సిహెచ్ అనిల్ రావు, ఆర్కే దయాసాగర్, జి నరసింహారెడ్డి, సిహెచ్ ధర్మారావు, రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు...

**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం కూకట్‌పల్లి నైనా కన్వెన్షన్‌లో నిర్వహించిన బుర్ర వారి వివాహ వేడుకలో బుర్ర ఐలయ్య గౌడ్ ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులైన మాళవిక, అరుణ్‌లను హృదయపూర్వకంగా అభినందించి నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆశీర్వదించారు.

# జనసేన పార్టీ లోకి గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, కూకట్పల్లి ఎమ్మెల్యే కంటెస్టెడ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చేతుల మీదుగా రాష్ట్ర నాయకురాలు మండపాక కావ్య, నియోజకవర్గం నాయకులు మహేష్ నాయుడు, బోయ జమ్మన్న ఆధ్వర్యంలో జరిగింది. టిఆర్ఎస్ ఉద్యమకారుడు తుమ్మల రవికుమార్, ప్రకాష్ గౌడ్.రాజేష్, వర్మ చారి, మురారి, సోమేశ్, పవన్, బాలు, లాల్ నాయుడు, చిన్న మద్దిలేటి, భాస్కర్ నాయుడు, జగన్, జన్మేశ్, నరసింహ, నరేష్, తిరుపాల్ గౌడ్, రామకృష్ణ, సంజు రెడ్డి, యాసిన్, తదితరులు జనసేన అధినేత ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల నమ్మకంతో పార్టీ కండువాలు కప్పుకొని జనసేనలో చేరారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు యడమ రాజేష్, జిహెచ్ఎంసి అడ్హాక్ కమిటీ సభ్యులు కొల్లా శంకర్ , స్టూడెంట్ వింగ్ అడక్ కమిటీ సభ్యులు సూర్య తోరం, మహేష్, బాడిత పవన్, రత్న సాయి, శ్రీనివాస్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగోడులో కోవా బన్ వలికి సంఘీభావం తెలిపిన మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ గారు...

**సామాన్యుల ఆత్మగౌరవానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది...**



నిన్న వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా పరిధిలోని మదరసా జామియా సిరాజుల్ ఉలూం నందు స్థానిక నివాసి అయినా కోవా బన్ వ్యాపారి వలిని స్వయంగా కలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ గారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న వ్యాపారులు సమాజంలో గౌరవంతో జీవించే హక్కు కలిగి ఉన్నారని తెలిపారు.
ఇటీవల జరిగిన సంఘటనల వల్ల వలి గారు మానసికంగా బాధపడిన విషయం తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పి పూర్తి మద్దతు ప్రకటించారు. చిన్న వ్యాపారుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపే విధంగా వ్యవహరించడం తగదని, ఈ సంఘటనకి కారణమైన వారు బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, అవసరమైతే సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరు చిన్న వ్యాపారులను గౌరవించి ప్రోత్సహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
ఈ అంశంపై ట్విట్టర్ (ఎక్స్) లో స్పందించిన హెచ్ఆర్డీ మంత్రివర్యులు నారా లోకేష్ గారు కూడా చిన్న వ్యాపారులకు అండగా నిలవాలని, వారికి అన్యాయం జరగకుండా చూడాలని పేర్కొన్న సందర్భంగా ముస్తాక్ అహ్మద్ గారు, ఆయనకు ముస్లిమ్స్ సమాజం తరుపున హృదయపూర్వక ధన్యవాదాలు తేలియజేసారు.తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు సామాన్య ప్రజల, చిన్న వ్యాపారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తుందని ముస్తాక్ అహ్మద్ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, టీడీపీ మైనారిటీ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం –

## – ఎగుమతులకు ఊతం, రైతులు, పరిశ్రమలకు రక్షణ



**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
– భారత్ , అమెరికా మధ్య కుదిరిన భారీ వాణిజ్య ఒప్పందం దేశ ఆర్థికాభివృద్ధికి కీలక మలుపుగా భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో రూపొందించిన ఈ ఒప్పందం ద్వారా భారతీయ పరిశ్రమలు, ఎగుమతిదారులు, సాంకేతిక రంగం, ఆరోగ్య రంగాలకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. అదే సమయంలో రైతుల ప్రయోజనాలు, దేశ ఆహార భద్రత, వ్యూహాత్మక స్వతంత్రతను కాపాడే విధంగా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.
ఈ ఒప్పందంలో ముఖ్యంగా వ్యవసాయ రంగానికి పూర్తి రక్షణ కల్పించడం ప్రాధాన్యతగా నిలిచింది. పాలు, పాడి ఉత్పత్తులు, పౌల్ట్రీ, మాంసం వంటి రంగాలకు ఎలాంటి సుంక రాయితీలు ఇవ్వకుండా భారత్ తన "నో కన్సెషన్" విధానాన్ని కొనసాగించింది. దేశీయ రైతులకు నష్టం కలగకుండా బియ్యం, గోధుమలు, చక్కెర, మొక్కజొన్న, సోయాబీన్ వంటి కీలక ఆహార పంటలను దిగుమతి సడలింపుల నుంచి మినహాయించారు. ఇది రైతుల ఆదాయ భద్రతకు కీలకంగా మారనుందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
అలాగే జన్యుమార్పిడి ఆహార ఉత్పత్తులపై ఉన్న కఠిన నియంత్రణలను కొనసాగించడం ద్వారా దేశ ఆహార భద్రత, ప్రజల ఆరోగ్య ప్రయోజనాలను కాపాడే చర్యలు తీసుకున్నారు. చిరుధాన్యాలు, నూనెగింజలు, వేరుశెనగ, పొగాకు వంటి పంటల విషయంలో కూడా దేశీయ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దిగుమతి విధానాలను నియంత్రించారు. దీని ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు భరోసా లభిస్తుందని భావిస్తున్నారు.
పరిశ్రమల పరంగా ఈ ఒప్పందం భారతదేశానికి పెద్ద ఊతంగా నిలవనుంది. ముఖ్యంగా వస్త్ర, చర్మ, పాదరక్షలు, ఆభరణాలు, బొమ్మల తయారీ రంగాలకు అమెరికా మార్కెట్లో మరింత అవకాశాలు లభించనున్నాయి. ఈ రంగాల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్న నేపథ్యంలో, ఎగుమతుల పెరుగుదలతో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశం ఉంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇది ప్రత్యేకంగా ఉపయోగపడుతుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.
భారతీయ ఔషధ రంగానికి కూడా ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. ఇప్పటికే ప్రపంచానికి తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు సరఫరా చేస్తున్న భారత్, ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్లో మరింత స్థానం సంపాదించే అవకాశం ఉంది. ఔషధ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు వల్ల భారత కంపెనీలకు ఎగుమతులు పెరిగే అవకాశముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీని ద్వారా దేశ విదేశీ మారక నిల్వలు పెరగడమే కాకుండా, ఔషధ రంగంలో పెట్టుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది.
విమానయాన, హైటెక్ తయారీ రంగాలకు కూడా ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. విమాన విడిభాగాలు, సాంకేతిక పరికరాల తయారీలో భారత్ కీలక కేంద్రంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అమెరికా కంపెనీలతో భాగస్వామ్యం ద్వారా భారత్‌లో ఆధునిక తయారీ యూనిట్లు ఏర్పడే అవకాశం ఉంది. ఇది దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.
సాంకేతిక రంగంలో కూడా ఈ ఒప్పందం కీలక పాత్ర పోషించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం పెరగనుంది. దీని ద్వారా భారత యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంది. అలాగే దేశంలో సాంకేతిక అభివృద్ధి వేగవంతమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
ఆరోగ్య రంగంలో ఈ ఒప్పందం సాధారణ ప్రజలకు కూడా ప్రయోజనం చేకూర్చనుంది. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే మందులు, పేస్‌మేకర్లు, అధునాతన వైద్య పరికరాలు తక్కువ ధరలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. వినియోగదారులకు అధిక నాణ్యత కలిగిన ఉత్పత్తులు అందుబాటులోకి రావడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది.
ఈ ఒప్పందం ద్వారా భారత్ తన వ్యూహాత్మక స్వతంత్రతను కాపాడుకుంటూనే, ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే దిశగా ముందుకు సాగుతోంది. ఏ దేశంపై పూర్తిగా ఆధారపడకుండా, సమతుల్య వాణిజ్య విధానాన్ని అనుసరించడం ద్వారా దేశ ప్రయోజనాలను కాపాడే ప్రయత్నం చేస్తోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ స్థానం మరింత బలోపేతం అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
మొత్తం మీద, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం దేశ ఆర్థికాభివృద్ధికి, పరిశ్రమల విస్తరణకు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు, సాంకేతిక అభివృద్ధికి కీలకంగా మారనుంది. రైతుల ప్రయోజనాలను కాపాడుతూ, పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తూ రూపొందించిన ఈ ఒప్పందం భారత్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింత బలమైన దేశంగా నిలబెట్టే దిశగా ముందుకు తీసుకెళ్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# శ్రీవారి లడ్డూ కల్తీని కప్పిపుచ్చే యత్నం మండలిలో వైసిపి సభ్యుల సిగ్గుమాలిన చర్య

**తిరుమలేశుడి ఫోటోలతో డ్రామాలు దుర్మార్గం**
**మండిపడ్డ తెలుగుదేశం ఎంపిలు**

శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంలో శాసనమండలిలో వైసీపీ నేతలు వేంకటేశ్వర స్వామి ఫొటోతో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ విషయంపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై తెలుగుదేశం ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు పట్టుకుని రాజకీయం చేస్తారా అని ధ్వజమెత్తారు. శాసనమండలిలో వైసీపీ తీరు సిగ్గు సిగ్గు అని ఎద్దేవా చేశారు. 'శ్రీవారి పవిత్ర లడ్డూలో కల్తీ జరిగిందని మాజీ టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి ఒప్పుకుంటే.. కల్తీ జరగలేదని వైసీపీ నేతలు కంత్రి వేషాలు వేస్తున్నారని దెప్పిపొడిచారు. క్రీడా స్ఫూర్తి చాటే లోకేశ్‌తో.. ప్యాలెస్‌లో పబ్జీ గేమ్ ఆడుకునే జగన్ రెడ్డికి పోలికా?' అని అప్పలనాయుడు సెటైర్లు గుప్పించారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరును సభ్య సమాజం వ్యతిరేకిస్తోందని టీడీపీ ఎంపీ సానా సతీశ్ పేర్కొన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు వేసుకుని ప్రదర్శిస్తున్న తీరు వైసీపీ నేతల మూర్ఖత్వానికి నిదర్శనని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. జగన్ ఆనందం కోసమే ఆ పార్టీనేతలు ఇలా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇలాంటి తప్పులు చేస్తూ వైసీపీ నేతలు కూడా పాపాలూ చేసే పరిస్థితి కొని తెచ్చుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎవరు చెప్పులు వేసుకుని రాలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని ఎంపీ సతీశ్ విమర్శించారు. సభ్య సమాజమంతా వైసీపీకి బుద్ధి చెప్పే సమయం వస్తుందని సానా సతీశ్ హెచ్చరించారు. లోకేశ్ క్రికెట్ చూడటానికి వెళ్తే జగన్‌కు వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. లోకేశ్‌ను చూసి జగన్ రెడ్డికి జలసీ, కుళ్లు అని ఎద్దేవా చేశారు. జగన్ ఎక్కడికైనా వెళ్లాలంటే కోర్టు పర్మిషన్ తీసుకుని వెళ్లాలని విమర్శించారు. టీవీలో క్రికెట్ చూడాలని జగన్‌కు రాసిపెట్టి ఉందని.. ఆయన నేరస్థుడు కాబట్టి బయటకు వెళ్లి క్రికెట్ చూడలేని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఇతర దేశాలకు వెళ్లాలంటే జగన్ రెడ్డి న్యాయస్థానం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. టీటీడీ లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికి హెరిటేజ్‌కు ముడిపెట్టారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కోను దేవుడు శిక్షిస్తారని.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 మంది సభ్యులు కూడా మిగలరని సానా సతీశ్ సెటైర్లు వేశారు. శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంపై టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పన్న ఎవరి పీఏనో అందరికీ తెలుసని, ఆయనకు సహాయం చేయమని జగన్‌మోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి గతంలో తనకు చెప్పారని అన్నారు. సహాయం చేసినందుకు ఆ నింద తనపై పడిందన్నారు. అప్పన్న ఎవరి పీఏనో దేశమంతా తెలుసునని ఎంపీ పేర్కొన్నారు.

# మెరుగైన సేవలకై..

- జలమండలి.. బస్తీ బాట..!!
- ప్రజలతో మమేకమవడానికి వినూత్న కార్యక్రమం
- శేరిలింగంపల్లి వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించిన అశోక్ రెడ్డి.
- ఉదయం 6 గంటలనుంచే అధికారులు బస్తీలలో పర్యటనలు.
- ఎస్ఆర్ నగర్ డివిజన్ పరిధిలో పర్యటించిన జెఎండీ మయాంక్ మిట్టల్
- తమ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఈడీలు, సీజీఎంలు జీఎంలు.

హైదరాబాద్ ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు





జలమండలి పరిధిలో తమ సేవలను సమర్థవంతంగా అందించే విధంగా క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి.. ప్రజలనుంచి నేరుగా సమస్యలు తెలుసుకునే విధంగా 'జలమండలి.. బస్తీ బాట ' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.అందులో భాగంగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఉదయం 6 గంటలకు శేరిలింగంపల్లి వార్డులోని శంకర్ నగర్, హుడా కాలనీ, దీప్తి శ్రీ నగర్, మియాపూర్ ప్రాంతంలో పర్యటించారు. శంకర్ నగర్ లో నీటి సరఫరా సమయంలో పలు ఇండ్లలో తనిఖీలు చేసి నీటి నాణ్యతను పరిశీలించారు. నేరుగా వినియోగదారులతో ముచ్చటించిన జలమండలి ఎండీ సరఫరా సమయాలు, సరిపడా నీరు సరఫరా అవుతున్నాయో, లేదో అడిగి తెలుసుకున్నారు. దానికి వారు అవసరానికి సరిపోతున్నాయని ఎండీ చెప్పారు. మరో ఇంటిని సందర్శించిన ఎండీ తాగునీటితో ప్రాంగణం కడిగి నీటిని వృథా చేయడంతో యజమానిని పిలిచి.. విలువైన నీటిని వృథా చేసినందుకు ఆగ్రహం వ్యక్తం చేసారు. నీటి ప్రాంగణాలు కడగటానికి మాపు లేదా వస్త్రాన్ని వినియోగిస్తే నీటి వృథా ఉండదని హితవు పలికారు. ఇది మళ్ళీ పునరావృత్తం అయితే పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.తదుపరి.. మరొక ఇంటిలో బోరు నీటిని మొక్కలకు, ప్రాంగణం కడగడం చూసిన ఎండీ ఇంకుడు గుంత నిర్మించేంత ఖాళీ స్థలం ఉండటంతో ప్రాంగణంలోని వృథా నీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించుకోవాలని సూచించారు. రూఫ్ వాటర్, వాన నీటిని భూమిలోకి ఇంకించేవిధంగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. దానికి జలమండలి సాంకేతిక సహాయం అందిస్తుందని ఇంటి యజమానికి చెప్పారు. అనంతరం హుడా కాలనీలో సీవరేజ్ మ్యాన్ హోల్ డీ-సిల్టింగ్ పనులను పరిశీలించిన ఎండీ.. మాల్ హోల్ లలో వెలువడ్డ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. రోడ్డుకు సమాంతరంగా లేని మ్యాన్ హోళ్ళను, ధ్వంసమైన మ్యాన్ హోళ్ళను గుర్తించి పునర్నిర్మాణం చేయమని సూచించారు. దానికి సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించమని చెప్పారు.అనంతరం మియాపూర్ ప్రధాన రహదారిపై సీవరేజ్ చొకేజి అయిన మ్యాన్ హోల్ వద్ద డీ-సిల్టింగ్ పనులను పరిశీలించారు. మాన్ హోల్ చొకేజి కారణాలను ఆరాతీయగా.. ప్రధాన రహదారిపై కొత్త రోడ్డు నిర్మించే సమయంలో సంబంధించిన శాఖ మ్యాన్ హోళ్ళను మూసివేశారని, దాంతో సీవరేజ్ లైన్ లో సిల్ట్ చేరి సమస్య తలెత్తిందని.. కొత్త రోడ్డు నిర్మాణంతో మ్యాన్ హోళ్ళ గుర్తింపు కష్టతరంగా మారిందని అధికారులు ఎండీకి వివరించారు. దానికి ఎండీ తాత్కాలికంగా సీవరేజ్ లైన్ ను సమీపంలోని ట్రంక్ మెయిన్ కు మళ్ళించి సమస్యను తగ్గించాలని సూచించారు. శాశ్వత పరిష్కారంగా చొకేజి అయిన లైనుకున్న మ్యాన్ హోళ్ళను గుర్తించడానికి మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు చెప్పారు. జలమండలి పరిధిలో తాగునీటి, మురుగునీటి సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి 'జలమండలి.. బస్తీ బాట' కార్యక్రమాన్ని రూపొందించిందని, ఇందులో భాగంగా ఎండీ నుంచి మేనేజర్ వరకు ప్రతీ మంగళవారం, బుధవారం, శుక్రవారం, శనివారం ఉదయం 7 గంటలనుంచి 10 గంటల వరకు బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. అనంతరం యధావిధిగా కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వివరించారు. ఈ పర్యటనలో క్షేత్రస్థాయిలో ప్రజలతో మాట్లాడి.. మంచినీరు, సీవరేజ్ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారని చెప్పారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించుకుంటారని చెప్పారు. అలాగే, నీటి వృథాను తగ్గించి, భూగర్భ జలాలను పెంచే విధంగా ఇంకుడు గుంతలు నిర్మించుకునే విధంగా అవగాహన కల్పిస్తారని చెప్పారు.ఎస్ఆర్ నగర్ డివిజన్ పరిధిలో పర్యటించిన జెఎండీ మయాంక్ మిట్టల్ఎస్ఆర్ నగర్ డివిజన్ పరిధిలో ఫతేనగర్ సెక్షన్ పరిధిలోని కైలాశ్ నగర్ పరిసర ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఎంసీసీ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. కాలనీల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లను సెక్షన్ కార్యాలయ ప్రాంగణానికి మార్చాలని సూచించారు. అనంతరం ప్రశాంత్ కాలనీలో వచ్చిన మురుగు ఓవర్‌ఫ్లో ఫిర్యాదును పరిశీలించారు. ఫతేనగర్ సెక్షన్ పరిధిలోని కైలాశ్ నగర్‌లో నిర్వహించిన తనిఖీలో, నీటి సరఫరా నాణ్యత, ప్రెషర్,షెడ్యూల్ అమలు సంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించారు.హైదరాబాద్ రీజియన్ ఈడీ సామ్రాట్ అశోక్ ఫాతిమా మస్జిద్, టోలిచౌకిలో కలుషిత నీటి ఫిర్యాదులు, లో-ప్రెషర్ ఫిర్యాదులు, షేక్‌పేట్, నానల్ నగర్ ప్రాంతాల్లో సీవరేజ్ సమస్యల పరిస్కారానికై అధికారులతో చర్చించారు. సుభాష్ నగర్, గణేష్ గ్రౌండ్, నెహ్రూ నగర్, గురుమూర్తి నగర్, కేపీహెచ్ బి కాలనీ, ఆదర్శ్ నగర్, ఇందిరా నగర్, పద్మా నగర్ ప్రాంతాల్లో అధికారులతో పాటు పర్యటించిన సైబరాబాదాద్ రీజియన్ ఈడి సంతోష్.మల్కాజిగిరి రీజియన్ ఈడీ పంకజ అధికారులతో రామంతాపూర్ సెక్షన్ పరిధిలోని శ్రీనివాసపురంలో బస్తీ బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. దీర్ఘకాలిక కలుషితం నీటి సరఫరా కాలుష్య ఫిర్యాదుల మరమ్మత్తు పనులు పరిశీలించారు. నీటి సరఫరాను పరిశీలించి, సరఫరా సమయంలో తాగునీటి నాణ్యత తనిఖీ చేశారు.ఉదయం 6 గంటలనుంచే జలమండలి సిజిఎంలు, జీఎంలు, అధికారులు క్షేత్ర తనిఖీలు నిర్వహిస్తూ తమ తమ పరిధిలో నీటిసరఫరా సివరేజ్ పనులను మెరుగుపరిచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్లు వినోద్ భార్గవ, నారాయణ, శ్రీనివాస రెడ్డి సీజీఎంలు, జీఎంలు ఇతర

# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

- ఎక్సైజ్ అధికారులకు ఆయుధాలు.. ప్రత్యేక శిక్షణకు చర్యలు
- కానిస్టేబుల్ సౌమ్య బలిదానం వృథా పోనివ్వం
- డ్రగ్స్ కట్టడికి అంకితభావంతో పని చేస్తున్న అధికారులకు అభినందనలు
- ఎక్సైజ్ అధికారుల డైరీ ఆవిష్కరణలో మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 20: భారతీయ వెలుగు




మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను శుక్రవారం రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు కోరల్లో చిక్కి ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమవుతోంది.. ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయి. తల్లిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇలాంటి అరాచక శక్తులను సమాజం నుంచి ఏరిపారేయాలి. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే మన లక్ష్యం కావాలి అని స్పష్టం చేశారు.విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు.స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉంది. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తాం అని జూపల్లి ప్రకటించారు.అక్రమ మద్యం నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్న అధికారులను ఈ సందర్భంగా మంత్రి జూపల్లి అభినందించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి అధికారులు తమ శక్తివంచన లేకుండా కృషి చేయాలని, ఈ పోరాటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అధికారుల వెంటే ఉంటుందని, అవసరమైన వనరులు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తన సహాయ సాకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ (జుఅటతీఠివవఎత్ ) జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా పోలీస్ క్రీడలు

హైదరాబాద్ ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు



సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 మూడో రోజూ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, జోన్లు, కమిషనరేట్లు, స్పెషల్ ఫోర్సెస్ నుంచి తరలివచ్చిన వందలాది మంది పోలీస్ అథ్లెట్లు తమ క్రీడా నైపుణ్యంతో మైదానాన్ని హోరెత్తించారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ వంటి ప్రధాన విభాగాలతో పాటు గ్రూప్ ఈవెంట్లలోనూ క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీపడ్డారు. ముఖ్యంగా మహిళా పోలీసులు గణనీయ సంఖ్యలో పాల్గొని, అద్భుత ప్రతిభను కనబరచడం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రీడల ద్వారా పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం, జట్టు సమన్వయం మెరుగుపడుతుందని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. వివిధ యూనిట్ల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సాగుతున్న ఈ పోటీలు శనివారం ముగియనున్నాయి.

## రెండు కేసుల్లో గంజాయి పట్టివేత..

హైదరాబాద్ ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు



రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సీఐ సుభాష్ చందర్, ఎస్సై అఖిల్ సిబ్బంది కలిసి ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ ప్రాంతంలో రెండు కేసుల్లో గంజాయిని పట్టుకున్నారు.బోడుప్పల్ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న ఏ అమర్ అనే వ్యక్తి వద్ద 1.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో మరో చోట గంజాయి అమ్మకాలు జరుపుతున్న పర్వ సురేష్ పట్టుకొని ఆతడి వద్ద ఉన్న 320 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఈ రెండు కేసుల్లోని గంజాయిని, నిందితులను ఘట్కేసర్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించినట్లు సీఐ సుభాష్ చంద్రర్ తెలిపారు.

## రంజాన్ నేపథ్యంలో బాలానగర్‌లో శాంతి కమిటీ సమావేశం




హైదరాబాద్ ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు

రంజాన్ పండుగను పురస్కరించుకుని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో పోలీసులు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ భారతదేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరారు. అన్ని కులాలు, మతాల వారు సోదరభావంతో మెలగడం మంచి సంప్రదాయమన్నారు.ముస్లింలకు రంజాన్ మాసం పవిత్రమైనదని, నమాజ్ సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే మత పెద్దలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.రంజాన్ మాసం మొత్తం ముస్లిం మత పెద్దలు, పోలీసుల సమన్వయంతో ఒక పీస్ కమిటీ ఏర్పాటు చేసి పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని ఏసీపీ సూచించారు. ఈ సమావేశంలో బాలానగర్ ఇన్‌స్పెక్టర్, ఇతర పోలీస్ అధికారులు, స్థానిక మత పెద్దలు పాల్గొన్నారు.

## సంగారెడ్డి మున్సిపల్ అభివృద్ధికి.. సదా నేను అండగా ఉంటా

- తనను కలిసిన సంగారెడ్డి మున్సిపల్ నూతన పాలకవర్గంతో కలెక్టర్ పి.ప్రావీణ్య హామీ
- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తో కలిసి కలెక్టర్ ను కలిసిన సంగారెడ్డి నూతన పాలకవర్గ సభ్యులు

హైదరాబాద్ ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు



ఇటీవల నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఈరోజు శుక్రవారం సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈరోజు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఆమెను కలిసారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లకు ఆమె అభినందనలు తెలియజేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల ఇచ్చిన మాట మేరకు సంగారెడ్డి మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలకు మేం కట్టుబడి ఉన్నామని వారు కలెక్టర్ కు వివరించారు. టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల సూచనల మేరకు సంగారెడ్డి మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని వారు కలెక్టరుకు వివరించారు. మెరుగైన పారిశుద్ధం, ఇంటింటికి స్వచమైన తాగునీరు, ప్రతి గల్లీలో సిసి రోడ్లు, ఇలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని వాళ్ళు వివరించారు. సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గంలో యువతీ యువకులు ఎక్కువగా ఉన్నారని, ఇది మున్సిపాలిటీకి చాలా ప్రయోజనం చేకూర్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని పాలకవర్గానికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ షఫీ హఫిజ్,

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంగుల రవి, కూన సంతోశ్, కౌన్సిలర్లు శ్రీకాంత్, ప్రశాంత్ రెడ్డి, రవి నాయక్, గుర్రం ఝాన్సీ, మోతే శ్యామ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

# ట్రై కార్పొరేషన్ లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటో కార్మికులు సహకరించాలి : ట్రై కార్పొరేషన్ ల కమిషనర్లు

**- పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కార్మికులతో ప్రత్యేక సమావేశం**
**- స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను ఓపిగ్గా విన్న కమిషనర్ లు**
**- కార్మికుల ఉద్యోగ భద్రతకు కమిషనర్ల హామీ**
**- ప్రమాద బీమా సౌకర్యం వర్తించేదుకు నిర్ణయం.**
**-రోజూ క్రమం తప్పకుండా ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరిస్తామని కమిషనర్ లకు కార్మికుల హామీ**

హైదరాబాద్ , 20 ఫిబ్రవరి భారతీయ వెలుగు
గ్రేటర్ హైదరాబాద్ సైబరాబాద్ మల్కాజిగిరి కార్పొరేషన్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పూర్తి సహకారం అందించాలని ట్రై కార్పొరేషన్ల కమిషనర్ లు ఆర్ వి కర్ణన్, జి సృజన, టి వినయ్ కృష్ణారెడ్డి లు సంయుక్తంగా కోరారు.శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ హెడ్ లో స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు , కార్మికులతో ట్రై కార్పొరేషన్ ల కమిషనర్ లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.స్వచ్ఛ ఆటో టిప్పర్ పారిశుద్ధ్య కార్మికులుసమస్యలను, విజ్ఞప్తుల ను ఓపిగ్గా విన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ , సైబరాబాద్ , మల్కాజ్ గిరి కార్పొరేషన్ ల కమిషనర్ లు ఆర్ వి కర్ణన్, జి సృజన, టి వినయ్ కృష్ణారెడ్డి లు
మాట్లాడుతూ...క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్




లలో సానిటేషన్ ను మరింత మెరుగుపరచాలని ఇటివలే స్పష్టం చేశారని అన్నారు. రోడ్లకు ఇరువైపుల, కాలనీలలో చెత్త కనిపించకూడదు అని ఆదేశించారని చెప్పారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సహకారం లేకుండా ఇది సాధ్యం కాదనీ కమిషనర్ లు పేర్కొన్నారు.క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్ పరిధిలో త్వరలో అమలు చేయనున్న100 రోజుల కార్యచరణలో ప్రణాళిక అమలులో కూడా సానిటేషన్ కు అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు.సానిటేషన్ పై ఫోకస్ చేయాలంటే ప్రైమరీ కనెక్షన్ పై ఫోకస్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రైమరీ కలెక్షన్ పై ఫోకస్ చేయాలంటే స్వచ్ఛ ఆటో లపై ఫోకస్ చేయాలన్నారు. 100 రోజుల కార్యచరణ అమలుకు స్వచ్ఛ ఆటో కార్మికులు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ కోరారు. స్వచ్ఛ ఆటో కు కేటాయించిన ఏరియాలో రోజూ రెగ్యులర్ గా ప్రతి ఒక్క ఇంటి నుండి 100 శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. స్వచ్ఛ ఆటో ల ద్వారా ప్రత్యేకించిన ఏరియాలో 100 శాతం ఇండ్ల నుంచి చెత్త సేకరణ జరిగేలా కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు పర్యవేక్షణ చేస్తారని కమిషనర్లు తెలిపారు. ఈూ అధికారుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా వీరు చూస్తారని చెప్పారు. చెత్త అన్ లోడింగ్ సమయంలో వెయిటింగ్ పీరియడ్ ను తగ్గిస్తామని స్పష్టం చేశారు. అనవసర వెయిటింగ్ లేకుండా చూసేందుకు
అవసరమైన చోట ఇంటర్మీడియట్ పోర్టబుల్ ట్రాన్స్ఫర్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా విలీనమైన పుర పాలికల్లో మ్యాపింగ్ పూర్తి చేసి ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తామన్నారు. కార్మికులకు ప్రమాదం జరిగితే ఎక్స్ గ్రేసియా చెల్లిస్తామన్నారు. ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకుంటామన్నారు.ఏదేని కారణంతో స్వచ్ఛ ఆటో కార్మికులు విధులకు హాజరు కాలేని పక్షంలో తమ రాఖీూ లకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. తద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులు ట్రై కార్పొరేషన్లను పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ క్యూర్ ఏరియాను నెంబర్ వన్ గా తీర్చిదిద్దడంలో పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు. సమావేశం చివరలో రోజూ క్రమం తప్పకుండా ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరిస్తామని కమిషనర్ లకు కార్మికులు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సానిటేషన్ అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, రవి కిరణ్ యాదగిరిరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ లు పాల్గొన్నారు.

# గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రకృతి మరియు సైన్స్ పై అవగాహన సదస్సు

పెద్దపల్లి ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు
గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం ప్రకృతిని, వైజ్ఞానిక దృక్పథాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశాల పైన అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకృతి ప్రజాకవి జయరాజు గారు, మరియు విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్ గారు, గాయత్రి కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ గారు, అమ్మ నేత్ర అవయవదాన ప్రోత్సాహక సంఘం నేత ఈశ్వర లింగం గారు పాల్గొనడం జరిగింది. ముఖ్యఅతిథి జయరాజ్ గారు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడాలని ఈ భూమండలం మీద సకల జీవరాశి మనుగడ సాధించాలంటే గాలి నీరు అందరికీ అవసరమని అవి నేడు కలుషితమవుతున్నాయని మానవులు విచ్చలవిడిగా యంత్రాల వాడకం వల్ల,అనేక రకాల ఫ్యాక్టరీల వల్ల మరియు పంటలలో ఎరువులు మరియు రసాయనాలు వాడకం వల్ల, ప్లాస్టిక్




వినియోగం వల్ల, మానవుడు సృష్టించే వ్యర్థాల వల్ల గాలి నీరు ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయని విద్యార్థులకు తెలియజేశారు. విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్ గారు మాట్లాడుతూ సైన్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మూఢనమ్మకాలను నమ్మవద్దని నేటి ప్రపంచంలో ప్రతి విద్యార్థి సైన్స్ తో సహవాసం చేయాలని సూచించారు. అదేవిధంగా అమ్మ నేత్ర అవయవ దాన ప్రోత్సహక సంఘం నేత ఈశ్వర లింగం మాట్లాడుతూ నేత్రదానంతో కార్నియల్ అందులో జీవితాల్లో వెలుగులు నింపొచ్చని ,అవయవ దానంతో కొందరు అభాగ్యుల జీవితాలను కాపాడచ్చని, దేహదానంతో వైద్య విద్యార్థులకు పాఠాలను నేర్పరచని చర్మదానంతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలుద్దామని, కేశ దానంతో మహిళ క్యాన్సర్ రోగులకు భరోసా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాత్ర కోఆర్డినేటర్ టిపిటిఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఏ విజయ్ కుమార్ గారు,విజ్ఞాన్ దర్శిని రాష్ట్ర అధ్యక్షులు ఆదం రాజుగారు, విజ్ఞాన దర్శిని నాయకురాలు శోభారాణి గారు,విజ్ఞాన దర్శిని రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అలీ గారు,యువజన సంఘం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి సురేష్,గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ జే రవీందర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శుక్రవారం సభ ద్వారా ప్రజారోగ్య పర్యవేక్షణ

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**
కరీంనగర్ ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు .
శుక్రవారం సభల్లో అంగన్వాడి, వైద్య సిబ్బంది ద్వారా నివేదిక తెప్పించుకుని ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.చొప్పదండి మండలం చాకుంట అంగన్వాడి కేంద్రం ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ తల్లీపిల్లల ఆరోగ్యానికి, పోషణకు శుక్రవారం సభ ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. పిల్లల ఆరోగ్యం పై ఎలాంటి సందేహాలు ఉన్నా శుక్రవారం సభలో ప్రభుత్వ వైద్యునికి తెలియజేయాలన్నారు. ప్రతినెలా అంగన్వాడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామాల వారీగా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన నివేదిక తెప్పించుకొని పర్యవేక్షిస్తున్నామని



తెలిపారు.బరువు తక్కువగా ఉన్న శిశువుల పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అలాంటి పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అతిగా బరువు తక్కువ ఉన్న చిన్నారులను ఎన్ఆర్సి లో చికిత్స అందించి సాధారణ బరువు పెరిగేలా చూస్తున్నామని తెలిపారు.శుక్రవారం సభలో 95 శాతం మంది మహిళలు ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారని, 245 మంది మహిళలకు రెండవ దఫా స్క్రీనింగ్ పూర్తయిందని, ఇది మంచి విషయమని అన్నారు. శుక్రవారం సభలో ఏర్పాటు చేసే హెల్త్ క్యాంపులను కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళా సర్పంచులు శుక్రవారం సభ నిర్వాహణకు ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని అన్నారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షలు పూర్తయ్యేంతవరకు పిల్లలను కచ్చితంగా ప్రతిరోజు బడికి, ప్రత్యేక తరగతులకు పంపించాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, శిశు వులకు అన్నప్రాసన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్య అధికారి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ పురం మాధవి, ఉపసర్పంచ్ వేముల శేఖర్, సిడిపిఓ నర్సింగారాణి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ భద్రత విభాగం కార్యదర్శి గోపాల్ రెడ్డి మృతి : డిజిపి సంతాపం

హైదరాబాద్: ఫిబ్రవరి 20: భారతీయ వెలుగు
రాష్ట్ర పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, ప్రస్తుత భద్రత మరియు ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శి ఆల గోపాల్ రెడ్డి (80) శుక్రవారం నాడు మరణించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చేరిన ఏ .గోపాల్ రెడ్డి, అంకితభావంతో పనిచేసి ఐపిఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం గత 20



ఏళ్లుగా భద్రత మరియు ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారు. గోపాల్ రెడ్డి ఆరోగ్య భద్రత పథకం ద్వారా సిబ్బందికి మెరుగైన వైద్యం అందేలా చూడటంతో పాటు భద్రత స్కీం క్రింద గృహ రుణాలు, పిల్లల విదేశీ విద్య వంటి అంశాల పర్యవేక్షణలో ముఖ్య భూమిక పోషించారు. 80 ఏళ్ల వయసులోనూ, అనారోగ్యం బారిన పడే వరకు ఆయన తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించడం విశేషం. శ్రీ గోపాల్ రెడ్డి మృతి పట్ల రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి. శివధర్ రెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్న డిజిపి వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

# నా ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము గంగుల కమలాకర్ కు లేదు...

**నాపై అసత్య ప్రచారాలు చేయించడానికి సిగ్గుండాలి...**
**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్....**



కరీంనగర్ ఫిబ్రవరి 20 భారతీయ వెలుగు
కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడే దమ్ము ధైర్యం లేకుండా పోయిందని , తాను సంధించిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక , పనికిమాలిన వాళ్లతో నాపై అసత్య ప్రచారాలు చేయించడానికి సిగ్గుండాలనీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్ ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు శనివారం రోజున గుగ్గిల రమేష్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. గంగుల కమలాకర్ పై తాను చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నానని, మాట్లాడిన భాషలో ఎక్కడ కూడా అన్ పార్లమెంటరీ వర్డ్స్ ఉపయోగించలేదన్నారు. చేసిన వ్యాఖ్యలకు గంగుల కమలాకర్ తనపై విద్వేషంతో జవాబు చెప్పలేక మీడియా ముందుకు వచ్చి మాట్లాడలేక ధైర్యం , దమ్ము లేకనే ఆయన అనుచరులతో మాట్లాడిస్తున్నారని , ఇది ఆయన సిగ్గుమాలినతనానికి నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గుగ్గిల్లపు ఇంటిపై, వాసాల రమేష్ ఇంటిపై దాడులు చేయిస్తానని చెప్పిన కమలాకర్, నేటి వరకు దాడులు చేసే ధైర్యం చేయలేదని , భయపడ్డారన్నారు. . గంగుల కమలాకర్ కు ఇప్పటికైనా దమ్ముంటే తాను ఎప్పుడు ఒంటరిగానే తిరుగుతానని, నువ్వు వస్తావో, నీ అనుచరులను పంపిస్తావో.. దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. అసత్య ప్రచారాలు నీ అనుచరులతో మాట్లాడించడం ఆపకపోతే నీ రాజకీయ జీవితంలో ఎన్ని మలుపులను మీడియా ముఖంగా ఆధారాలతో సహా బయట పెడతానని హెచ్చరించారు. గుగ్గిళ్ళపు రమేష్ అంటే ఆషామాషీ వ్యక్తి కాదని ఐదుసార్లు ప్రజా జీవితంలో నిలబడి గెలిచానని నీలాగా భూమాఫీయాను ప్రోత్సహించి, గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని పెంచి పోషించలేదని.. ప్రజలను ఇబ్బంది పెట్టేటువంటి పనులను చేయలేదని ఆయన చెప్పారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మానుకొని మూసుకొని కూర్చొని ఉండాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నిన్ను రాజకీయంగా బొంద పెట్టడమే లక్ష్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ నాయకత్వం లో, బిజెపి పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యేగా ఎలా గెలుస్తావో చూస్తామని, మేము సవాల్ విసురుతున్నమనీ, ఈ సవాలుకు నువ్వు కట్టుబడి ఉండు నీకు దమ్ముంటే గెలిచి చూపించు, నువ్వు ఎలా గెలుస్తావో మేము చూస్తామని సవాల్ విసిరారు. 2028లో బిజెపిని అడ్డుకొని చూడు నీకు దమ్ముంటే, నువ్వు ఎమ్మెల్యే గా నిలబడు నీస్థానం ఏమిటో చూపిస్తామన్నారు. నీ చుట్టూ ఉన్న కోటరీ మాయం చేశాం, కేవలం డబ్బుకు నీ ఎంగిలి మెతుకులకు ఆశపడ్డ వాళ్లు మాత్రమే నీవద్ద మిగిలారని, డబ్బు బలంతోనే నువ్వు మిగిలి ఉన్నావని, గంగుల ప్రజాబలం ప్రజావిశ్వాసం కోల్పోయాడని ఎద్దేవా చేశారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు..... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్**
పెద్దపల్లి, ఫిబ్రవరి-20: భారతీయ వెలుగు



విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులను శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఫిబ్రవరి 17న హైదరాబాద్ లోని దోమలగూడ లో ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ (జబొూచీ) విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పెద్దపెల్లి జిల్లాకు చెందిన 20 మంది సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు.
జూలపల్లి మండలానికి చెందిన బడుగు సందీప్ జిగ్ జాగ్ వాకింగ్ లో 1వ బహుమతి , కమాన్ పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందినఎడునూరి పౌర్ణమి చెస్ పోటీలో 1వ బహుమతి, రొంపికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కటకం శ్రీరామ్ చరణ్ పరుగుపందెంలో 1వ బహుమతి, మ్యూజికల్ చైర్ లో 2వ బహుమతి, జిగ్‌జాగ్ వాకింగ్ లో 2వ బహుమతి సాధించారు.విజేతలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి శారద ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి జి.శారద, ఐఈ కోఆర్డినేటర్ జి. కవిత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్రీకరణలను సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ యంత్రికరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయి
- 50శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రలను ప్రభుత్వం అందిస్తోంది
- రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- వ్యవసాయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది
- సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 20**
రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలో అందిస్తున్న వ్యవసాయ యంత్రీకరణలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జనగామ జిల్లా పరిధిలోని 5మండలాల నుండి 30మంది లబ్ధిదారులకు సబ్సిడీపై రోటవెటర్స్, బేయిలర్స్ వంటి వ్యవసాయ పనిముట్లను లబ్ధిదారులకు పంపిణి చేశారు. అలాగే డిఆర్ డిఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సబ్సిడీపై అందించిన చేపల విక్రయ మొబైల్ వ్యాన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. రైతులపై ఆర్థిక భారం తగ్గించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. రైతుల పట్ల గతంలో ఎప్పుడూ లేనంతగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ, పంటల మద్దతు ధరలు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామాల నుంచి ఎంపికైన 30 మంది లబ్ధిదారులకు



వ్యవసాయ పనిముట్లు అందజేయడం జరిగిందని, అర్హులైన లబ్ధిదారులకు 15 రోజుల్లోనే పనిముట్లు అందజేయాలని అధికారులు సూచించారు. అలాగే సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, రైతు సంఘాల ద్వారా ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఎంపీ పేర్కొన్నారు. రైతులు ఆధునిక పరికరాలను వినియోగించుకొని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యవసాయం లాభసాటిగా ఉండడం లేదని, వ్యవసాయ పెట్టుబడి భారం అవుతుందని అన్నారు. అందుకే ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ పనులకు యంత్రికరణ చేసేందుకు ప్రోత్సహం అందిస్తోందని తెలిపారు. వ్యవసాయ యంత్రికరణకు 50శాతం సబ్సిడీతో పనిముట్లను ప్రభుత్వం అందిస్తోందని వెల్లడించారు. కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ యంత్రికరణ పద్ధతులను రైతులు పాటించాలని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొట్ట మొదటిగా మన నియోజకవర్గంలోనే ఈ సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పంపిణి చేసుకుంటున్నామని తెలిపారు. ఏ పథకం వచ్చిన మొదట ప్రారంభించుకునేది మన నియోజకవర్గంలోనే అని అన్నారు. వ్యవసాయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పని చేస్తుందని అన్నారు. నిన్నటి నుండే సన్నాలకు బోనస్, రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమ అవుతున్నాయని తెలిపారు. వీటితో పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. సబ్సిడీ పై వ్యవసాయ పనిముట్లు కోసం ఇంకా దరఖాస్తు చేసుకొని రైతులు రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ.. మొత్తం జిల్లాలో 3వేల 320 యూనిట్లు మంజూరు అయ్యాయని అందులో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే 1600యూనిట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ రోజు 30యూనిట్లు పంపిణి చేసుకుంటున్నామని తెలిపారు. మార్చి లోపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిడి కట్టిన 15 రోజులలో పనిముట్లు అందుతాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చెసుకోవాలని తెలిపారు. పాస్ బుక్ ఉన్న ప్రతీ రైతు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేకపోతే ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ, సబ్సిడీ పథకాలు వర్తించవని సూచించారు. ఈ రోజు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుకుంటున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పింకేష్, ఆర్డీఓ వెంకన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, డిఆర్ డిఏ పీడీ వాసంతి, మండల వ్యవసాయ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ వినయ్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, జవివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కింగ్ స్టన్ ఆస్పత్రి 4వ వార్షికోత్సవ వేడుకలు

- ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యం పొందాలి
- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్

**భారతీయ వెలుగు హైదరాబాద్, ఫిబ్రవరి 20**
ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై అవగాహన పెంపొందించుకొని ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజరుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ లోని కింగ్ స్టన్ ఆస్పత్రి 4వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా.. 'ఊపిరితిత్తుల ఆరోగ్యం -సంరక్షణ -నివారణ' పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తారేక్ అన్సారి, డాక్టర్ ఆశిష్ చౌహాన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు, మెడికల్ డైరెక్టర్, డాక్టర్ మహమ్మద్ పైసల్, రెవరెండ్ బ్రదర్ జాన్, ప్రఖ్యాత ఆర్థికవేత్త, డాక్టర్ అమీరుల్లా తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా




ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అజరుద్దీన్ మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, వాటి వల్ల శరీరంలో ఇతర అవయవాలకు పొంచి ఉన్న ప్రమాదాలపై రోగులకు అవగాహన కల్పించేందుకు కింగ్ స్టన్ ఆస్పత్రి ముందుకు రావడం సంతోషకర విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ నిజజీవితంలో తమ శరీరంలో అత్యంత కీలకమైన సున్నితమైన ఊపిరితిత్తులను నిర్లక్ష్యం చేయకుండా, తమకు తామే సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. శారీరిక శ్రమతో పాటు ప్రతి ఒక్కరూ, ప్రతిరోజు సుమారు అరగంట పాటు వ్యాయామం చేయాలని ఆయన తెలిపారు.

ముఖ్యంగా ధూమపానం వల్ల ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని ఆరోగ్యకరమైన, ఊపిరితిత్తుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అనంతరం,, కింగ్స్టన్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, డాక్టర్ మహ్మద్ పైసల్ మాట్లాడుతూ,,,, తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో, కమ్యూనిటీ స్క్రీనింగ్ క్యాంపులు, సిపిఆర్ పై శిక్షణ, వర్క్ షాపులు, పాఠశాల కళాశాల విద్యార్థులకు, ఊపిరితిత్తుల సంరక్షణ పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు, తమ ఆసుపత్రి 4, వ వార్షికోత్సవం సందర్భంగా ఊపిరితిత్తుల ఇన్స్ పైర్ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కింగ్ స్టన్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అఫ్జల్‌గంజ్ ఇన్స్ పెక్టర్ మోహన్ రావు కు సత్కారం




**భారతీయ వెలుగు హైదరాబాద్, ఫిబ్రవరి 20**
అఫ్జల్‌గంజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా కె. మోహన్ రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ ఆర్ లక్ష్మణ్ రావు నేతృత్వంలో పలువురు ప్రముఖులు ఇన్ స్పెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మోహన్ రావు ను శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి లక్ష్మణ్ రావు అభినందించారు. ఇన్ స్పెక్టర్ నేతృత్వంలో అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని మరియు ప్రజా భద్రత అత్యంత ప్రాధాన్యతగా ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన సభ్యులు మరియు స్థానిక శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఛాంపియన్లుగా తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 20**
హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 2వ ఎడిషన్ చీఫ్ మినిస్టర్ కప్-రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచే క్రీడా ప్రతిభను వెలికితీసి, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే విధంగా క్రీడాకారులను తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. 2036 ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలు సాధించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. అథ్లెటిక్స్ విభాగాన్ని హనుమకొండకు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. క్రీడలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యతోపాటు క్రీడలు కూడా అవసరమన్నారు. ఆటల్లో గెలుపు-ఓటములు సహజమని, ఆటల్లో



పాల్గొనడమే ఒక విజయం అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందని, మెంటల్ ఫిట్నెస్, ఫిజికల్ ఫిట్నెస్ రెండూ అత్యంత ముఖ్యమని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ



నిర్మాణానికి క్రీడలు కీలకమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి
ఎమ్మెల్యే కృషితో సింథటిక్ ట్రాక్, బాక్సింగ్ స్టేడియం వంటి సదుపాయాలు పూర్తయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి అశోక్, జనరల్ సెక్రటరీ సారంగపాణి, వైస్ ప్రెసిడెంట్ రమేష్ రెడ్డి, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ ప్రతాప్, పిఈటి అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, ఏసీపీ నరసింహారావు, ఇతర క్రీడా అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు శివకుమార్ కు మాతృభాష ప్రతిభ పురస్కారం ప్రధానం

**భారతీయ వెలుగు హైదరాబాద్, ఫిబ్రవరి 20**



నాగర్ కర్నూలు జిల్లా, వంగూరు మండలంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ (పి.హెచ్.సి, డీఈఓ)లో డాట ఎంట్రీ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న ఎ.శివకుమార్ మాతృ భాషా ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 22న ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్, చిక్కడపల్లి లోని త్యాగరాయ గానసభలో వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాల ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన ఎ.శివకుమార్ కరోనా సమయంలో ప్రజలకు తనవంతు గా విశేష సేవలందించినందుకు వారి సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్సీ సిరికొండ మధు సూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారం బహూకరిస్తారని తెలిపారు. ఈ అవార్డుకు ఎంపిక కావడం పై పలువురు ప్రముఖులు, గ్రామస్తులు, పి.హెచ్.సి ఉద్యోగులు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# వరంగల్‌లో ఇండో అరబ్ వెల్ఫేర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

**భారతీయ వెలుగు వరంగల్, ఫిబ్రవరి 20**
ఇండో అరబ్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు, విద్యా ప్రోత్సాహం లక్ష్యంగా రెండు ముఖ్యమైన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాలు సామాజిక వర్గాల్లో ప్రశంసలు అందుకుంటున్నాయి.మొదటి దశలో ఒక ఓల్డ్ ఏజ్ హోమ్, అనాథాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులు, అనాథలకు ప్రత్యేకంగా పండ్లు మరియు నాణ్యమైన భోజనం అందించారు.తాజా పండ్లు,పోషకాహారంతో కూడిన భోజనం, ఇతర అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు.ఫౌండేషన్ బాధ్యులు వృద్ధులతో సమయం గడిపి వారి క్షేమాన్ని తెలుసుకుని, సమాజంలో వారు ఒంటరిగా లేరని నమ్మకం కలిగించారు.లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఇదే కార్యక్రమం కొనసాగింపుగా హనుమకొండలోని







కుమారపల్లి మార్కెట్ గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ లో మార్చి 14 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులకు పరీక్షా కిట్లు పంపిణీ చేశారు.ఈ కిట్లలో అవసరమైన స్టేషనరీ మరియు పరీక్షలకు సంబంధించిన సామగ్రి చేర్చారు.దీంతో విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం కల్పించారు.ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్ షేఖ్ ఫరీద్ ఉల్ హక్,అధ్యక్షుడు షేఖ్ సయీద్ ఉల్ హక్, థంగుతూరి నరేశ్ కుమార్,పూజారి గిరి బాబు,మహ్మద్ జియా తదితర సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "విద్యే భవిష్యత్తుకు హామీ అని, సమాజంలోని బలహీన వర్గాలకు సహాయం చేయడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.సేవా కార్యక్రమాలు, విద్యా సహాయం కొనసాగేందుకు దాతలు తమ జకాత్ మరియు సదఖాలను అందించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.మరిన్ని వివరాలకు:9700952733
కార్యాలయ చిరునామా: ఆఫీస్ నం. 37-డి, రెండోవ అంతస్తు,గ్రీన్ స్క్వేర్ ప్లాజా,ఐసీఐసీఐ పైన,పబ్లిక్ గార్డెన్ ఎదురుగా, కిషన్‌పురా,హనుమకొండ

# తెలంగాణ స్టేట్ మీట్‌లో ఫుట్‌బాల్ క్రీడలో వరంగల్ కమిషనరేట్ పోలీసులకు కాంస్య పతకం



**భారతీయ వెలుగు వరంగల్, ఫిబ్రవరి 20**
హైదరాబాద్ లో నిర్వహించిన నాల్గవ తెలంగాణ స్టేట్ మీట్‌లో ఫుట్‌బాల్ క్రీడలో పాల్గొన్న వరంగల్ కమిషనరేట్ పోలీస్ జట్టు విశిష్ట ప్రతిభ కనబరిచి మూడవ స్థానం సాధించి కాంస్య పతకం దక్కించుకుంది. ఇంతజార్గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ.షకూర్ నాయకత్వంలో జట్టు, క్రీడాస్ఫూర్తితో,సమన్వయంతో ఆడుతూ ప్రతిభా పాటవాలు చాటింది. కఠినమైన పోటీల మధ్య జట్టు ఐక్యతతో ముందుకు సాగి ఈ విజయాన్ని అందుకుంది. ఈ పోటీలలో మొదటి స్థానం (స్వర్ణ పతకం) హైదరాబాద్ జట్టు కైవసం చేసుకోగా,ద్వితీయ స్థానం (రజత పతకం) మల్కాజ్గిరి జట్టుకు లభించింది. వరంగల్ కమిషనరేట్ పోలీస్ జట్టు మూడవ స్థానం సాధించి కాంస్య పతకాన్ని అందుకుంది.ఈ విజయం వరంగల్ కమిషనరేట్ పోలీసుల క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం మరియు జట్టు భావాన్ని ప్రతిబింబిస్తూ,క్రీడా రంగంలో వారి ప్రతిష్టను మరింత పెంచింది.

# పోచమ్మగుడి, పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే నాగరాజు

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 20**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని తరాలపల్లి గ్రామంలో పోచమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం భూమి పూజ మరియు పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి సంబంధించి భూమి పూజ కార్యక్రమాలు ఘనంగా ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా వర్ధన్నపేట



నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక క్షేత్రాల



అభివృద్ధి మరియు సామాజిక వర్గాల కోసం సమూహ భవనాల నిర్మాణం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ వెలుగు
శనివారం ఫిబ్రవరి 21, 2026

# స్టేషన్ ఘనపూర్ ను మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- త్రాగు నీరు, పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత
- 2050అవసరాలకు తగ్గట్లుగా త్రాగు నీటి సరఫరా కోసం డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయాలని నిర్ణయం
- 50కోట్లకు సంబంధించిన అన్ని పనులకు మార్చి నాటికి టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించాం
- సోమవారం వరకు పారిశుధ్య కార్మికులు 3నెలల జీతాలు
- అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు పాలన అందించాలి





**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 20**
వచ్చే 5ఏళ్లలో మనందరం కలిసి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చెందిన మున్సిపాలిటీగా అభివృద్ధి చేసుకుందామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. శుక్రవారం స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ మొదటి పురపాలక సంఘం సర్వసభ్య సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలపై, త్రాగు నీటి సరఫరా, పారిశుధ్యం సమస్యల పరిష్కారానికి పలు ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని అన్నారు. స్టేషన్ ఘనపూర్‌ను 'మోడల్ మున్సిపాలిటీ'గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేయాలని, చేపట్టే ప్రతి అభివృద్ధి పని భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను నోటి మాటగా కాకుండా డాక్యుమెంటేషన్‌తో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 18 ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు నిత్య విద్యార్థుల్లా పనిచేస్తూ అభివృద్ధి సాధించాలని హితవు పలికారు. మున్సిపాలిటీకి వచ్చిన రూ.50 కోట్ల నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలు, అంతర్గత రోడ్ల మరమ్మతులు, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పేదలు, మహిళలు, వృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా, జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని, వాటి పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, నేను, ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే మరిన్ని నిధులు తెచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని మాడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే మనందరి లక్ష్యం అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు అన్నారు. వచ్చే 5ఏళ్లలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయయాలని అందుకు ప్రజలు, అధికారులు సహకరించాలని తెలిపారు. ముఖ్యంగా అత్యధిక ప్రాధాన్యతగా త్రాగు నీరు, పారిశుధ్య పనులపై ఎక్కువ దృష్టి సారించాలని అన్నారు. 2050 అవసరాలకు అనుగుణంగా త్రాగు నీటి సరఫరా పై డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ రూపొందించాలని అధికారులకు సూచించారు. అదేవిదంగా ప్రస్తుత అవసరాలకు అవసరమైన చర్యలు వేంటనే చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీకి మంజూరు అయిన 50కోట్ల పనులకు సంబందించి మార్చి మొదటి వారం నాటికి అన్ని అనుమతులు తీసుకొని టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. వార్డు కౌన్సిలర్లు మీమీ వార్డులలో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి 50 లక్షల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అలాగే వార్డుకు 30ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి లిస్ట్ తయారు చేయాలని తెలిపారు. ఎన్నికలతోనే రాజకీయాలు అయిపోయాయని ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా వార్డులను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని ఇందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. సోమవారం నాటికి పారిశుధ్య కార్మికులకు 3నెలల జీతం అందించనున్నట్లు తెలిపారు. వచ్చే 2,3 నెలల్లో పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు అన్ని చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ.. ఎక్కడైనా మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత నిధులు వస్తాయి కానీ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీకి మాత్రం ముందుగానే 50కోట్ల రూపాయల నిధులు వచ్చాయని అన్నారు. ఈ 50కోట్ల పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టడం తోపాటు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. వార్డులలో అన్ని పనులు ఒకేసారి చేపట్టాలెమని అలా చేస్తే ఏ పనిని కూడా పూర్తి చేయలేమని అన్నారు కావున ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని తెలిపారు. అభివృద్ధి పనులలో జాప్యం లేకుండా చూసుకోవాలని, వార్డు కౌన్సిలర్లు, అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మన ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. త్రాగు నీరు, పారిశుధ్య పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలు పై కూడా దృష్టి సారించాలని తెలిపారు. అందరం కలిసి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పింకేష్, ఆర్డీఓ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ వినయ్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరూరి సమక్షంలో.. బిఆర్ఎస్ లో చేరిక





**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 20**
వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ పరిధిలోని మడికొండ గ్రామానికి చెందిన దువ్వ శ్రీకాంత్, నవీన్ ఆధ్వర్యంలో బిజెపి మడికొండ జోనల్ ప్రధాన కార్యదర్శి కుక్కల రాకేష్, జోనల్ ఉపాధ్యక్షులు పండుగ రాజ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నుండి మస్కుల కిషన్, పత్రి జేమ్స్, పులి కిరణ్, దార నితిన్, రాహుల్, రాజ్ కుమార్ సుమారు 50 మందికి పైగా యువత బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ఈ కార్యక్రమంలో బొల్లికొండ వినోద్, కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మరాఠ సామ్రాజ్యానికి, పరమత సహనానికి, ఐక్యతకు చిహ్నం శివాజీ మహారాజ్!!

- పి ఆర్ టి యు తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల కార్ వెంకటేష్ (ఆర్కే )

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 20**
అన్యాయానికి తలొగ్గని ధైర్యం, మహిళల గౌరవ పరిరక్షణ, శత్రువులపైనా మానవత్వం ప్రదర్శించిన ఆయన నాయకత్వం నేటికీ స్ఫూర్తిదాయకం. ఐక్యతకు, స్వాభిమానానికి చిహ్నంగా శివాజీ మహారాజ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పి ఆర్ టి యు తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల కార్ వెంకటేష్ (ఆర్కే ) అన్నారు. శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల మహారాష్ట్రలోని తుల్జాపూర్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంలో ఆర్కే వెంకటేష్ మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ తన చిన్న వయసులోనే అత్యంత ధైర్యశాలి, పోరాటయోధుడు గేరిల్లా యుద్ధంలో తనదైన శైలిలో పశ్చిమ భారతదేశంలో మొఘల్,బీజాపూర్ సుల్తానులు హిందువులపై అనిచివేత ఆగడాలను ఎదిరించిన దీశాలి.1630 లో మహారాష్ట్రలోని శివనేరి నీ ప్రాంతంలో జన్మించిన శివాజీ స్వయంభుగా దుర్గాభవాని శివాజీకి ఖడ్గము బహుకరించిన చారిత్రక సంఘటన భారతదేశ చరిత్రకారులు మరువలేని ఘట్టం అని పేర్కొన్నారు ఆర్కే .గొరిల్లాయుద్ధము అనంతరము1674లో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి చత్రపతి శివాజీ మహారాజ్ గా రాయగడ్ నందు పట్టాభిషేకము చేసుకొని బిరుదాంకితుడయ్యాడు. స్త్రీలను గౌరవిస్తూ ప్రజా రంజక పాలనను అందించి పరమత సహనానికి ఐక్యతకు మారుపేరు శివాజీ మహారాజు అనడంలో అతిశక్తి లేదని ఈ సందర్భంలో ప్రజలు వారి చరిత్రను పునరావృతం చేసి భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ప్రజల మధ్య స్నేహ సంబంధాలను , నైతిక విలువలను పొందించే క్రమంలో యువత ముందుకు వచ్చి భారతజాతి ఔన్నత్యాన్ని కాపాడాలని ఆర్కే వెంకట్ ఈ సందర్భంగా ప్రజలందరికీ పిలుపునిచ్చారు.






## సర్టిఫికెట్స్ జారీలో జాప్యం చేయొద్దు

- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 20**
తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్స్ జారీ చేయడంలో జాప్యం చేయొద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వేలేరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్బంగా సర్టిఫికెట్స్ పెండింగ్, భూభారతి, తదితర వివరాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మీసేవ సర్టిఫికెట్స్ త్వరతగతిన జారీ చేయాలని, జాప్యం చేయకూడదని అన్నారు.
భూభారతి, సాదాబైనామా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మొదలైన సర్టిఫికెట్ ల స్టేటస్ లను తహసీల్దార్ కోమి ని అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ( వేలేరు) ను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల యొక్క హెల్త్ ప్రొఫైల్, వారికి అందించే భోజనం మెను ప్రకారం ఉంటుందా లేదా తెలుసుకొని ఆహార నాణ్యత ను పాటించాలని తెలియజేశారు అలాగే స్టాక్ రిజిస్టర్, కంప్లైంట్ బాక్స్ లను చెక్ చేశారు. కిచెన్ పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు.అదే విధంగా ప్రైమరీ హెల్త్ సెంటర్ (వేలేరు) ను ఆకస్మిక తనిఖీ చేసి ఉద్యోగులు సమయ పాలన పాటించాలని, వైద్య సేవలకు వస్తున్న రోగుల పట్ల అంకిత భావం కలిగి ఉండి సేవ చేయాలని చెప్పారు. ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ మెడిసిన్ రూమ్ లని తనిఖీ చేశారు. ఈ సందర్బంగా పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తొందరేమీ లేదు..అన్నింటికి మూల్యం తప్పదు

## తన ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన అంబటి

**భారతీయ వెలుగు గుంటూరు,ఫిబ్రవరి20**
తొందరేమీ లేదు.. అన్నింటికి మూల్యం చెల్లించుకునే సమయం వస్తుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పర్మిషన్ తీసుకునే నల్లపాడు వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లాను. టీడీపీ నేతలు కర్రలు, రాడ్లు తీసుకుని నా కారు మీదకు వచ్చారు. టీడీపీ నేతలు కట్టిన ఫ్లెక్సీని చించలేదు. ఇది మంచి సాంప్రదాయం కాదని చెప్పా. గూండాలు 4 గంటల పాటు బీభత్సం సృష్టిస్తే పోలీసులు ఏం చేశారని అంటూ ఆయన ప్రశ్నించారు. పోలీసులు, గూండాలు ఏకమై దారుణంగా ఇంటిపై దాడి చేశారు. ఆ మాట అనడాన్ని నా అంతరాత్మ ఒప్పుకోలేదు.. నేను బాధపడ్డాను. టీడీపీ నేతలు తిడుతున్నారనే ఉద్దేశంతో మాట అన్నాను. బ్యాచ్‌లుగా బ్యాచ్‌లుగా నా ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో నా పిల్లలు, నా మనవళ్లు ఉన్నారు. పోలీసులు సాక్షిగానే నా ఇంటి మీద దాడి చేశారు. నాలుగు గంటల పాటు నా ఇంటి మీద కరాళ నృత్యం చేశారు. పోలీసులు రక్షణ కల్పించలేక పారిపోండి అన్నారు. ఇదిలావుంటే అక్రమ కేసులో అరెస్ట్ అయ్యి.. బుధవారం
బెయిల్‌పై విడుదలైన అంబటి రాంబాబు తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, టీడీపీ రౌడీ మూకలు తన ఇంటిని ధ్వంసం చేసిన తీరు, హత్యాయత్నం, పోలీసుల నిర్లిప్త వైఖరి, కొంతమంది పోలీసు అధికారుల అత్యుత్సాహం వంటి అంశాలను వైఎస్ జగన్‌కు వివరించారు. తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అధికార పార్టీకి ఒత్తాసు పలుకుతూ వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరును జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ భేటీలో అంబటితో పాటు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

## హిందూపురంలో బాలయ్యకు నివాసం

### –కొత్త ఇంటి నిర్మాణానికి భార్యతో కలసి శంకుస్థాపన

**భారతీయ వెలుగు హిందూపురం,ఫిబ్రవరి20**
హిందూపురం శాసనసభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారు. శుక్రవారం సతీమణి వసుంధర దేవితో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ సొంతింటి నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. హిందూపురంలో హ్యాట్రిక్ విజయంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణ ఇన్ని రోజులు ఇక్కడ అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురంలో ఓ ఇంటి వాడవుతున్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా గెలిచిన ఎమ్మెల్యే బాలకృష్ణ.. నియోజకవర్గ పర్యటనకు హైదరాబాద్ నుంచి వచ్చి వెళుతుంటారు. అయినా నియోజకవర్గ ప్రజలు కానీ, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే బాలకృష్ణ ఎప్పుడు హిందూపురం వచ్చిన అంతే ఉత్సాహంతో ఉంటున్నారు. ఇటీవల ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణపై సంచలన ఆరోపణ చేశారు. హైదరాబాదులో ఉండే బాలకృష్ణ, హిందూపురంలో పరిపాలిస్తున్నారంటూ విమర్శించారు. వారు చేసిన కామెంట్స్ హిందూపురంలో ప్రకంపనలు పుట్టించాయి. ప్రత్యర్థులకు హిందూపురంలో తాను స్థానికుడిని కాదు అని చేస్తున్న వ్యాఖ్యలకు.. అవకాశం ఇవ్వకూడదని ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించుకున్నారు. దీంతో హిందూపురం పట్టణంలో సొంతింటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. హిందూపురం సమీపంలోని వన్నమ్మ కాలనీలో సర్వే నెంబర్ 445లో 81 సెంట్ల భూమిని ఎమ్మెల్యే బాలకృష్ణ కొనుగోలు చేశారు. ఆ స్థలంలో మూడంతస్తుల భవనంతో పాటు.. స్విమ్మింగ్ పూల్, ఆహ్లాదకరమైన ఉద్యానవనం, ఇతర సౌకర్యాలతో ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం. తమ అభిమాన నటుడు, హ్యాట్రిక్ విక్టరీ కొట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ కొత్త ఇల్లు ఎలా ఉంటుందో అని హిందూపురంలో ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
శనివారం ఫిబ్రవరి 21, 2026

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మంథని సబ్ రిజిస్ట్రార్



**భారతీయ వెలుగు ప్రతినిధి మంథని ఫిబ్రవరి 20**
మంథని మండలం పుట్టపాక గ్రామానికి కన్నూరి బాపు చెందిన ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రూ. 16,500 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మంథని రిజిస్టర్ కాసర్ల రాజేందర్ డాక్యుమెంట్ రైటర్ రషీద్. ఇంచార్జ్ కరీంనగర్ ఏసీబీ డిఎస్పి మధు ఆధ్వర్యంలో దాడిలో రెడ్ హ్యాండ్ గా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# అనారోగ్యంతో మరణించిన రాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన

» నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 20**



మెదక్ జిల్లా శివంపేట మండలంకొంతన్ పల్లి గ్రామంలో చింతల జగజీవన్ రెడ్డి గారి తండ్రి రామ్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడ నన్ను తెలుసుకుని వారి కుటుంబాన్ని శు క్రవారం నాడునర్సాపూర్ నియోజకవర్గం శాసనసభ్యురాలు వాకిటిసునీత లక్ష్మారెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి మనోధర్యం ఇవ్వడం జరిగిందిఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, తాజామాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, తాజా మాజీ సర్పంచ్ గైనిబైటి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఆకుల సంధ్యారాణి శివకుమార్, మాజీ ఉపసర్పంచ్ ములుగు నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఆకుల ఇందిరా శ్రీనివాస్ ,మాజీ సర్పంచ్ జంగం దేవలింగం, మాజీ వార్డు సభ్యులు గుండు శంకర్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల మోహన్ రెడ్డి, గూడూరు యాద గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కుమ్మరి నవీన్, శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

# ఊదరి శ్యామ్ మృతి బాధాకరం...

## - మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**భారతీయ వెలుగు ప్రతినిధి మంథని ఫిబ్రవరి 20**



బీఆర్ఎస్ కార్యకర్త ఊదరి శ్యామ్ మృతి బాధాకరమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఊదరి శ్యామ్ మృతి చెందగా ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఊదరి శ్యామ్ అంతిమ యాత్రలో పాల్గొని పాడే మోసి అశ్రు నివాళులు అర్పించారు. ఊదరి శ్యామ్ లాంటి కార్యకర్తను కోల్పోవడం బాధగా ఉందని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలిపారు.....

# విద్యా నిర్మాణ పనులపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ సమీక్ష



**భారతీయ వెలుగు , సంగారెడ్డి ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లాలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్ లలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనుల ను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో మండల విద్యా అధికారులు, సమగ్ర శిక్ష విభాగంతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. పీఎం శ్రీ పథకం, భవిత సెంటర్లు, కేజిబివి సివిల్ వర్క్స్‌తో పాటు పలు విద్యా నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. భవిత సెంటర్ల నిర్మాణంలో జహీరాబాద్, మొగుడంపల్లి, కల్హేర్, కొండాపూర్, మనోహర్, మునిపల్లి, పుల్కల్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో పనుల పురోగతిపై వివరాలు అడిగి, నిర్మాణ వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కేజీబీవీ భవనాల నిర్మాణాల్లో న్యాల్కల్, నాగలిగిద్ద, పుల్కల్, మనూర్, సిర్గాపూర్, వట్టిపల్లి ప్రాంతాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు.
పీఎం శ్రీ పథకం కింద సైన్స్ ల్యాబ్‌లు, ఇతర భవన నిర్మాణాల పురోగతిని విద్యా శాఖ అధికారులు కలెక్టర్ కు విచారించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్‌ఆర్జీఎస్ కింద మంజూరైన టాయిలెట్లను మార్చి నెల వరకు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.
పీఎం శ్రీ బడ్జెట్, డేటా, ప్రీ-ప్రైమరీ పాఠశాలల అంశాలు కూడా సమావేశంలో పరిశీలించబడ్డాయి. సంబంధిత విభాగాలకు డేటా ఖచ్చితత్వం, పనితీరుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి ఆధ్వర్యంలో నిరంతర సేవా యజ్ఞం

**- 54వ శుక్రవారం అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహణ.....**

**భారతీయ వెలుగు ప్రతినిధి వీణవంక ఫిబ్రవరి 20......**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలోని ప్రసిద్ధ పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో గత 54 శుక్రవారాలుగా నిరంతరంగా కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఈరోజు కూడా భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గ్రామ ప్రజలు, భక్తులు, దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిరవధికంగా కొనసాగుతూ ఆదర్శంగా నిలుస్తోంది.
ఈ రోజు 54వ శుక్రవారం సందర్భంగా గ్రామానికి చెందిన పూదరి రాజేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు పూదరి సమ్మయ్య--పద్మ దంపతులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జన్మదినాన్ని ఆడంబరాలకు దూరంగా ఉంచి సేవా కార్యక్రమంగా నిర్వహించడం పట్ల గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఆలయ చైర్మన్ గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ, పూదరి రాజేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు





తెలియజేశారు. గత 54 శుక్రవారాలుగా ఈ సేవా కార్యక్రమానికి అండగా నిలిచిన ప్రతి దాతకు, ప్రతి సభ్యుడికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఐక్యత, సేవాభావం, భక్తి పరంపర కొనసాగాలంటే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.
పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో నిర్వహించే అన్నప్రసాద వితరణలో ప్రత్యేకత ఏమిటంటే పర్యావరణ హిత దృక్పథం. ఎలాంటి ప్లాస్టిక్, పేపర్ ప్లేట్లు, డిస్పోజబుల్ గ్లాసులు వాడకుండా మోదుగాకుల విస్తార్లు లేదా అరటాకుల్లో భోజనాలను వడ్డిస్తూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ సంప్రదాయాన్ని కాపాడుతూ ప్రకృతి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.
కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముక్తవరం శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల పెద్దమనిషి కొలిపాక పోచలింగం మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు గ్రామానికి గౌరవం తెస్తున్నాయని అన్నారు.
ఈ కార్యక్రమంలో కర్రె వెంకట నర్సయ్య (డీలర్), పూదరి రాజేష్, దూలం కిరణ్, కర్రె లచ్చయ్య, కర్రె స్వామి, పూదరి కుమార్ తదితరులు, అమ్మ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
గ్రామీణ స్థాయిలో ప్రారంభమైన ఈ సేవా యజ్ఞం 54 వారాలు పూర్తి చేసుకోవడం విశేషం. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించి పేదలకు, అవసరమైన వారికి సహాయం చేసే దిశగా ముందుకు తీసుకెళ్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి శు క్రవారం అమ్మవారి ఆశీస్సులతో ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

# వెన్నెముక శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

**- అత్యాధునిక పద్ధతులతో వైకల్య సవరణ**
**- స్పైన్ సర్జన్ డాక్టర్ మధుకిరణ్ యార్లగడ్డ**

**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 20**
వెన్నెముక సమస్యలు, వైకల్యాల సవరణలో అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ మధుకిరణ్ యార్లగడ్డ తెలిపారు. శు క్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన ఆయన, సింగపూర్‌లోని ఎన్ యూహెచ్ఎస్ వంటి అంతర్జాతీయ సంస్థల్లో శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు.
స్కోలియోసిస్ (వెన్నెముక వంకర) వంటి సంక్లిష్ట సమస్యలకు భారతదేశంలో అతికొద్ది మంది మాత్రమే




చేసే వెర్టెబ్రల్ బాడీ టెదరింగ్ (వీబీటీ), యాంటీరియర్ స్కోలియోసిస్ కరెక్షన్ ( ఏఎస్ సీ) వంటి శస్త్రచికిత్సలను తాము విజయవంతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. 3డి ఇమేజింగ్, ఏఐ , ఆధారిత ప్లానింగ్ ద్వారా వెన్నెముక సహజ కదలికలు దెబ్బతినకుండా 70 శాతానికి పైగా వంకరను సరిచేయవచ్చని తెలిపారు.
తక్కువ కోత.. త్వరితగతిన కోలుకునే అవకాశం
యూనిపోర్టల్ ఎండోస్కోపిక్ సిస్టమ్స్ ద్వారా వేలిముద్ర పరిమాణంలో ఉండే చిన్న కోతతోనే డిస్క్ సమస్యలు, నరాలు నొక్కబడటం వంటి వ్యాధులకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఈ పద్ధతిలో రక్తస్రావం 90 శాతం వరకు తగ్గుతుందని, ఇన్ఫెక్షన్ల భయం ఉండదని పేర్కొన్నారు. దీనివల్ల రోగులు శస్త్రచికిత్స జరిగిన రోజే డిశ్చార్జ్ అయ్యి, కొద్ది వారాల్లోనే సాధారణ పనుల్లో చేరవచ్చని వివరించారు. గతంలో విఫలమైన సర్జరీలను సరిచేయడం వెన్నెముక కణితులు , తీవ్ర గాయాలకు న్యూరో మానిటరింగ్ పద్ధతిలో అత్యంత భద్రంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. రోగుల జీవన నాణ్యతను పెంచడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.
ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి ప్రతినిధులు సింహరాజు శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

# ఆస్థి కోసం సహోదరునిపై హత్య ప్రయత్నం చేసిన అన్న...

**- తెల్లవారుజామున కత్తితో దాడి... ముగ్గురికి తీవ్ర గాయాలు**
**- నిందితున్ని అరెస్ట్ చేసిన గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు**

**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 20:**
గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మార్కండేయ కాలనీలో రెండు కుటుంబాల మధ్య ఆస్థి, ఇతర వివాదాల కారణంతో కత్తి తో దాడి చేసి హత్యాయత్నంకి పాల్పడిన నిందితుని అరెస్ట్ వివరాలు ఏసీపీ కార్యాలయంలో గోదావరిఖని ఏసిపి ఎం రమేష్,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనరెడ్డి కలిసి అరెస్ట్ వివరాలు వెల్లడించారు. నిందితుడు గాడిచెర్ల రామ్ దూత్ బిటెక్ చదివి ప్రస్తుతం సోరియాసిస్ చర్మ వ్యాధితో ఇంట్లోనే ఉంటున్నాడు. నిందితుని తాత రాయమల్లు కట్టించిన ఇంటిలో పెద్ద కుమారుడు సారయ్య కుటుంబం ఒక భాగంలో ఉండగా, చిన్న కుమారుడు శ్రీనివాస్ కుటుంబం మరో భాగంలో ఇద్దరు కుమారుల పక్కపక్కనే చెరో భాగంలో నివసిస్తున్నారు. శ్రీనివాస్ పదకొండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య సుమిత్రి, కుమారుడు ప్రణయ్ (22), కుమార్తె




సువర్చలా, సుమిత్రి తల్లి కొమురమ్మ అక్కడే ఉంటున్నారు. నిందితుడు రామ్ దూత్ తండ్రికి ఫిట్స్, బీపీ సమస్యలు ఉండగా, తల్లికి గుండె సమస్యలు ఉన్నాయి. పిన్ని సుమిత్ర కిరాణా దుకాణంలో సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా అమ్ముతుండగా, వాటి వాసన మరియు సిగరేటు అక్కడే త్రాగడం వల్ల వచ్చే పొగ కారణంగా తమ ఆరోగ్యం దెబ్బతింటోందని రామ్ దూత్ కుటుంబం పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంపై తరచూ గొడవలు జరిగాయి. అదేవిదంగా నిందితుని రామ్ దూత్ తండ్రి, చిన్న నాన్న (బాబాయ్ ) కుటుంబ ఆస్తి తనకే వస్తుందని భావించి బాబాయ్ కుటుంబ సభ్యులను చంపాలని రామ్ దూత్ నిర్ణయించుకొని, గత సంవత్సరం అక్టోబర్ 5న అమెజాన్ ద్వారా కొబ్బరి కత్తి కొనుగోలు చేసి ఇంట్లో దాచుకున్నాడు. హత్యకు గల కారణాలను ఒక నోటు బుక్కులో కూడా రాసుకున్నాడు. నిందితుని పథకం లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున సుమారు ఉదయం 5 గంటల సమయంలో, పిన్ని సుమిత్ర నిద్ర లేచి, తలుపులు తీసి , బాత్రూం కు వెళ్లగా రామ్ దూత్ కత్తితో పక్కింట్లోని బాబాయ్ ఇంటికి వెళ్లి పడుకుని ఉన్న ప్రణయ్పై ఛాతీ, భుజాలు, మెడపై దాడి చేశాడు. అరుపులు విని అడ్డుకున్న కొమురమ్మకు ముఖం, చెవి, చేతిపై గాయాలు అయ్యాయి. తరువాత సుమిత్రిపై కూడా ముఖం, చేతులపై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలు చేశాడు. అరుపులు విని అక్కడికి వచ్చిన చుట్టూ ప్రక్కన వ్యక్తులు నిందితుడిని అడ్డుకుని కత్తి లాక్కొన్నారు. దాడి సమయంలో బట్టలపై రక్తం పడటంతో బట్టలు మార్చుకుని రామ్ దూత్ ఇంటి నుండి పారిపోయాడు. వారిని మొదటగా గోదావరిఖని గవర్నమెంట్ హాస్పిటల్ కు తర్వాత కరీంనగర్ ?అవ హాస్పిటల్ కు తీసుకుపోయి అడ్మిట్ చేశారు. నిందితుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వద్ద దాక్కొని బస్ స్టాండ్కు వెళ్తున్నాడు అనే నమ్మదగిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఇంద్రాసేనా రెడ్డి, అక్కడకి వెళ్లి నిందితుడిని పట్టుకొని అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్ తరలించి అరెస్ట్ చేసి కోర్ట్ లో హాజరు పరిచి రిమాండ్ కి తరలించడం జరిగిందని ఏసీపీ తెలిపారు.

# సంత్ సేవాలాల్ జయంతి సంబరాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 20**
మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ కేంద్రంలోనిసంత్ సేవాలాల్ జయంతి సంబరాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ పట్టణ ప్రధాన కూడలి నుంచి హైదరాబాద్ రహదారిలోని ఆలయం వరకు చేపట్టిన భారీ శోభాయాత్రలో గిరిజన సోదరులతో కలిసి అడుగులు కలిపి,వారి గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం



తెలుపుతూ ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంజారా ప్రజలకు సేవాలాల్ చేసిన సేవలుచిరస్మరనీయమన్నారుగిరిజను లకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. బంజారాల గురించి ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. సేవాలాల్ చూపించిన మార్గంలోనే అందరూ నడవాలని ఉద్ఘాటించారు. తండాలాల్లో నివసించే ప్రతీ కుటుంబం తమ పిల్లలను చదివించుకోవాలసిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. చదువు ఎవ్వరి సొత్తు కాదని, పిల్లలు చదివితేనే బంగారు భవిష్యత్తు ముందుంటుందని అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, కౌన్సిలర్లు,నర్సాపూర్ మండల అధ్యక్షుడు మల్లేష్, గిరిజన సంఘ నాయకులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, సర్పంచులు సురేష్ నాయక్, ఉదయ్ కుమార్ మాజీ ఎంపీటీసీ అశోక్, అధికారులు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను మొదలు..

**భారతీయ వెలుగు ప్రతినిధి ఇల్లందకుంట ఫిబ్రవరి 20 ,**

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానము లో ప్రతి సంవత్సరం నిర్వహించబడే శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు -- 2026 ఈ సంవత్సరం మార్చి 26, 2026 నుండి ఏప్రిల్ 07, 2026 వరకు అత్యంత వైభవోపేతంగా, ఆధ్యాత్మిక భక్తి శ్రద్ధలతో జరగనున్నవి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడనుంది. వేలాదిమంది భక్తులు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుండి కూడా తరలి వచ్చే అవకాశం ఉండటంతో, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయుటకు దేవస్థాన యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినది.
బ్రహ్మోత్సవాల విజయవంత నిర్వహణలో భాగంగా, వివిధ రకాల సేవలు, సరఫరాలు, పనుల కోసం అనుభవజ్ఞులైన కాంట్రాక్టర్లు, సరఫరాదారుల నుండి లోయేస్ట్ సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడుచున్నవి. భక్తులకు మెరుగైన వసతులు, శుభ్రమైన వాతావరణం, సమగ్ర విద్యుత్--శబ్ద వ్యవస్థ, ప్రత్యక్ష ప్రసార సదుపాయాలు అందించుట ప్రధాన లక్ష్యంగా ఈ





కొటేషన్లు కోరబడుతున్నాయి.
కోరబడిన పనుల విస్తృత వివరాలు:
1. వైట్ పెండ్యాల్స్, గ్రీన్ మ్యాట్స్, కూలర్లు, స్టాండ్ ఫ్యాన్లు తదితర సామాగ్రి సరఫరా:
బ్రహ్మోత్సవాల రోజుల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానుండటంతో, వేడి వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని చల్లదనం కల్పించే విధంగా కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయవలెను. అలాగే పూజా కార్యక్రమాలు, కళ్యాణోత్సవం, సీతారాముల కల్యాణం వంటి ప్రధాన కార్యక్రమాల కోసం విశాలమైన పెండ్యాల్స్ ఏర్పాటు చేయవలెను.
2. చలువ పందిర్లు, 'క్యూ' లైన్లు ఏర్పాటు:
భక్తులు క్రమబద్ధంగా దర్శనం పొందేందుకు ప్రత్యేక క్యూ లైన్లు, తాత్కాలిక చలువ పందిర్లు ఏర్పాటు చేయుట.
3. లైటింగ్ మరియు సౌండ్ సిస్టమ్:
మొత్తం ఆలయ ప్రాంగణం విద్యుత్ వెలుగులతో అలంకరించబడాలి. ప్రత్యేకంగా సాయంత్రం వేళల్లో దీపాలంకరణ, శోభాయాత్రలు, హరికథలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అత్యాధునిక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయవలెను.
4. ఐదు (05) ఎల్.ఇ.డి టీవీలు (ప్రత్యక్ష ప్రసారంతో):
ప్రధాన కార్యక్రమాలు, కల్యాణోత్సవం, పల్లకీసేవలు తదితరాలను ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులకు ప్రత్యక్ష ప్రసారం చేయుటకు ఐదు ఎల్ ఇ డి టీవీలు ఏర్పాటు చేయాలి.
5. పూజా, కిరాణా మరియు అన్నదాన సామాగ్రి సరఫరా:
పూజా ద్రవ్యాలు, నైవేద్య వస్తువులు, కిరాణా సరుకులు, అన్నదానానికి అవసరమైన బియ్యం, కూరగాయలు, నూనెలు తదితరాల సరఫరా.
6. దేవస్థానం పెయింటింగ్, రంగులు, సున్నములు వేయుట:
బ్రహ్మోత్సవాల ముందు ఆలయ గోడలు, మండపాలు, ప్రధాన ద్వారాలు అందంగా కనిపించేలా పెయింటింగ్ పనులు చేయుట.
7. సంవత్సరం మొత్తం పూజా మరియు కిరాణా సామాగ్రి సరఫరా:
నిత్య పూజా కార్యక్రమాలకు అవసరమైన దినసరి వస్తువుల సరఫరా.
8. సంవత్సరం మొత్తం విద్యుత్ సామాగ్రి సరఫరా:
బల్బులు, ట్యూబ్ లైట్లు, వైర్లు, స్విచ్‌లు తదితర విద్యుత్ పరికరాల సరఫరా.
9. సంవత్సరం మొత్తం వస్త్రముల సరఫరా:
దేవతా మూర్తులకు అవసరమైన వస్త్రాలు, పట్టు వస్త్రాలు, అలంకరణ సామాగ్రి.
10. సంవత్సరం మొత్తం పూలు మరియు పూలదండల సరఫరా:
నిత్య పూజలు, ప్రత్యేక ఉత్సవాలు, అలంకరణలకు పూలు మరియు దండలు.
కొటేషన్ సమర్పణ విధానం:
ఒక్కొక్క కొటేషన్‌కు దరఖాస్తు రుసుము: రూ. 500/-
సీల్డ్ లోయేస్ట్ కొటేషన్లు సమర్పించవలసిన తేది: 24-02-2026 ఉదయం 11:00 గంటల లోపు
సీల్డ్ కొటేషన్లు విప్పబడునది: 24-02-2026 మధ్యాహ్నం 12:00 గంటలకు
పూర్తి వివరాలకై: దేవస్థాన కార్యాలయాన్ని సంప్రదించగలరు.
ఆసక్తి గల అర్హత కలిగిన కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా తమ సీల్డ్ లోయేస్ట్ కొటేషన్లు సమర్పించవలసిందిగా దేవస్థాన యాజమాన్యం విజ్ఞప్తి చేయుచున్నది. బ్రహ్మోత్సవాల నిర్వహణలో పారదర్శకత, నాణ్యత, సమయపాలనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడును.
భక్తుల సమక్షంలో సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరుగుతున్నాయని దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ మహోత్సవం విజయవంతం కావాలంటే స్థానిక ప్రజలు, దాతలు, సేవా సంఘాలు, వ్యాపారవేత్తలు సహకరించాలని కోరారు.
ఈ ప్రకటనను బహుళ ప్రచారం నిమిత్తం తమ తమ దినపత్రికలలో, వారపత్రికలలో ప్రచురించగలరని దేవాదాయ ధర్మాదాయ శాఖ తరపున వినమ్ర విజ్ఞప్తి చేయబడుచున్నది.

**--- దేవాదాయ ధర్మాదాయ శాఖ**
**శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్**
**ఇంగిలే రామారావు**
**ఇల్లందకుంట, కరీంనగర్ జిల్లా**

## శివ్వంపేట మండలంలోని మల్లు పల్లి తాండ లో మంచినీటి సౌకర్యం లేదన్న స్వభావంతో

**- సొంత నిధులు వెచ్చించి బోరుబావిని తవ్వించిన**
**- ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్త**

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 20**
ప్రజల క్షేమమే తన క్షేమంగా భావిస్తూ తన సహృదయంతో శివంపేట మండలంలోని పలు గ్రామాలలో సమస్యలే కాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న నేనున్నాను అనే స్వభావంతో ప్రజల వెంట ఉంటూ ప్రతి ఒక్క గ్రామంలో సమస్యలు ఉన్నాయని తెలుసుకున్న ఆయన ఆపద్బాంధవుడిగా ఆదుకొని తనకు తోచినావిధంగా సహాయపడుతూ మానవ సేవే మాధవసేవఅనే నినాదాన్ని నిజం చేయగలిగిన ఈకైక వ్యక్తి మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట మండలానికి చెందిన మాజీ జడ్పిటిసి అబ్బా మహేష్ గుప్తా అని సోంపేట మండల ప్రజలు పలువురు ఆయనను దేవ మహాదేవునిగా కలియుగ పురుషుడిగా తాను మానవ రూపంలో ఉన్న మహా విష్ణుమూర్తిగా ఆపదలు ఉన్న ప్రతి మానవుని



ఆదుకున్న వ్యక్తి అని శివంపేట మండల గ్రామాల ప్రజలు నిత్యం తనను తలుచుకుంటూ జ్ఞాపకం చేసుకోవడం జరుగుతుందని శివంపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు ఆయనకు పదవులు ముఖ్యం కాదు ప్రజాసేవయే ముఖ్యమని ఆయన జనంలో తిరుగుతూ జనానికి జరిగిన సమస్యలను తెలుసుకోవడమే కాకుండా తనకు తోచే విధంగా సహాయపడుతూ రాజకీయంగా కాకుండా తన వ్యక్తిగత విధంగా ఆపదలలో ఉన్నవారిని ఆదుకునే ఆజానుబావుడని శివంపేట మండల కేంద్రంలో ఆయన జన్మించడం శివంపేట మండల ప్రజలు చేసుకున్న పుణ్యమని తాను జీవితకాలం ప్రజల సేవలు చేయడమే తన కర్తవ్యం గా భావించిన ప్రజల మనిషి అని పలువురు తెలియజేస్తున్నారు అదే కొవలో శివంపేట మండలంలోని మల్లుపల్లి తండాలో మంచినీటితో తాండావాసులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని స్వభావంతో ఆయన శుక్రవారం నాడు తన సొంత నిధుల నుండి బోరు బావని తవ్వించిన ఆయనకు తాండావాసులం ఎంతో రుణపడి ఉంటామని మల్లుపల్లి తండావాసులు తెలియజేశారు అతనిని ఆ భగవంతుడు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలకాలం ఆనందోత్సవంగా ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామని వారు తెలియజేశారుఈ కార్యక్రమంలో మల్లు పల్లి తాండ సర్పంచ్ కేతావత్ నరేష్, ఉప సర్పంచ్ విజయ్, ఉసిరిక పల్లి సర్పంచ్ సుజాత కృష్ణారెడ్డి మండల బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,వార్డు మెంబర్ సబిత, పద్మ, మాజీ సర్పంచ్ గ్యాదరి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ దేవుని స్వామి,పిట్ల సత్యనారాయణ, రాజేష్, కేతావత్ హరిచంద్ కేతావత్ హటియ కేతవత్ తుకారం దేవుని మహేష్ రమేష్ సాయి గోపాల్ రవి రాజు అమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కుటుంబ సభ్యులు



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 20:**
రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల శ్రేయస్సు, శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వోడితల ప్రణవ్ బాబు

**-- కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా....**

**భారతీయ వెలుగు ప్రతినిధి వీణవంక ఫిబ్రవరి 20.**
వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రంగయ్య మృతి స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గ్రామ అభివృద్ధికి కృషి చేసిన ప్రజానాయకుడిని కోల్పోవడం పట్ల గ్రామస్తులు, పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే ప్రాంతీయ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకొని నివాళులు అర్పించారు.
ఈ నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు బేతిగల్ గ్రామానికి చేరుకొని మృతుని నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా అంబాల రంగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆయన, అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి దుఃఖాన్ని పంచుకున్నారు. మృతికి గల కారణాలు, చివరి రోజుల పరిస్థితులు, కుటుంబ ఆర్థిక స్థితిగతులు తదితర విషయాలను ఆరా తీశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబాల రంగయ్య గారు గ్రామ ప్రజల కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి అని పేర్కొన్నారు. సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. తాగునీటి సమస్యలు, రోడ్లు, కాలువలు, పాఠశాల అభివృద్ధి





వంటి అనేక అంశాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటిస్తూ అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు.
అంబాల రంగయ్య గారి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, వారి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్న ప్రణవ్ బాబు, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వ స్థాయిలో కూడా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.
గ్రామ ప్రజలు కూడా ఈ సందర్భంగా అంబాల రంగయ్య గారి సేవలను స్మరించుకున్నారు. పార్టీకి నిస్వార్థంగా సేవలందించిన ఆయన వంటి నాయకులు అరుదని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు మసాడి చొక్కారావు, చిద్రాల దామోదర్, ఉప సర్పంచ్ మడ్డి మహేష్, గ్రామ అధ్యక్షులు మడ్డి అనిల్, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, నాయకులు నల్ల కొండల్ రెడ్డి, పత్తి సమ్మిరెడ్డి, భోగం వెంకటస్వామి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు గ్రామ ప్రజలతో కలిసి కొంతసేపు మౌనంగా నిలబడి నివాళులు అర్పించారు.
గ్రామంలో విషాద వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, అంబాల రంగయ్య గారి సేవలను స్మరించుకుంటూ సంతాప సభ నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
అంతిమంగా, ప్రజాసేవకు అంకితభావంతో పని చేసిన అంబాల రంగయ్య గారి ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ ప్రార్థించారు. వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యసాహసాలు ప్రసాదించాలని కోరుకున్నారు. గ్రామ ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని నాయకులు పేర్కొన్నారు.

## కుటుంబ తగాదాలతో కత్తులతో దాడి..







**- ముగ్గురికి తీవ్ర గాయాలు**

**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 20:**
పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని మార్కండేయ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున సంచలన ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై కత్తితో దాడి జరగడంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక వన్ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం, కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదం ఈ దాడికి కారణమైంది. రామ్ దూత్ అనే యువకుడు తన సొంత బంధువులు అయిన ప్రణయ్, సుమిత్ర, కొమురమ్మలపై కొబ్బరికాయలు కొట్టే కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మార్కండేయ కాలనీలో నివసిస్తున్న ప్రణయ్ కుటుంబ పోషణ కోసం ఇంటి ముందర చిన్న షాపు ఏర్పాటు చేసి సిగరెట్లు విక్రయిస్తున్నాడు. షాపు వద్దే వినియోగదారులు సిగరెట్లు తాగడం వల్ల వచ్చే పొగ వాసనపై రామ్ దూత్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ షాపు మూసివేయాలని కోరుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై కొంతకాలంగా ఇరువురి మధ్య వివాదం కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం తీవ్ర ఆగ్రహంతో రామ్ దూత్ ప్రణయ్ ఇంటిలోకి ప్రవేశించి కత్తితో దాడి చేశాడు. అడ్డుకునేందుకు వచ్చిన ప్రణయ్ పిన్ని సుమిత్ర, అమ్మమ్మ కొమురమ్మలపై కూడా దాడి చేయడంతో వారికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. బలమైన కత్తిపోట్ల కారణంగా ప్రణయ్ పరిస్థితి విషమంగా మారింది. మొదట బాధితులను స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా, ప్రణయ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కరీంనగర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మండలిలో వైసిపి మహాపచారం

**- చెప్పులు, షూస్ వేసుకుని దేవుడి ఫొటోల ప్రదర్శన**
**- మండలి ఛైర్మన్ ఛాంబర్ ముందు కూటమి నేతల నిరసన**

ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యులు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలను ప్రదర్శించడాన్ని కూటమి సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఛైర్మన్ ఛాంబర్ వద్ద మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఎన్డీఏ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైకాపా చేసిన మహాపచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, రామానాయుడు, కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొన్నారు. హిందు మతాన్ని అవమానించారని ఛైర్మన్‌కు మంత్రులు తెలిపారు. ఇలాంటి చర్యను ఛైర్మన్ ఎలా అంగీకరిస్తారని నిలదీశారు. వైకాపా చేసింది తప్పేనని మండలి ఛైర్మన్ మోషేన్ రాజు స్పష్టం చేశారు. వైకాపా సభ్యులను పిలిచి మాట్లాడతానని ఛైర్మన్ తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పించి లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. చట్టసభ సాక్షిగా వైకాపా సభ్యులు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. హిందూ మతాన్ని రెచ్చగొట్టేలా వైకాపా ప్రవర్తించిందని మండిపడ్డారు. హద్దులు దాటి ప్రవర్తించి దేవదేవుడు పట్ల మహాపచారానికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు ఎంతో కలచివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగటం తగదన్నారు. సంయమనం పాటించే కొద్దీ రెచ్చగొడుతున్నారని.. హిందువుల పట్ల వైకాపా విధానం ఇదేనా అని నిలదీశారు. వెంకటేశ్వర స్వామి పట్ల తమ పార్టీ విధానం ఇదేనని జగన్ చెప్తున్నారా..? అని ప్రశ్నించారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. జగన్ డైరెక్షన్‌లోనే వైకాపా ఎమ్మెల్సీలు స్వామి వారిని తీవ్రంగా అవమానించారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. జనసేన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని నిర్లక్ష్యంగా విసిరేయడం తేలిగ్గా తీసుకునే విషయం కాదని ధ్వజమెత్తారు. జాతి క్షమించరాని నేరానికి వైకాపా సభ్యులు, జగన్ పాల్పడ్డారని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుయ్యబట్టారు. సభ వాయిదా పడగానే వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను ప్లకార్డులతో పాటు విసిరేసి వెళ్లారని ఆయన ఆరోపించారు. భారతజాతికి జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరస్వామి అంటే ఇంత చులకన భావమేంటని మండిపడ్డారు.

# ముఖ్యమంత్రిరేవంతన్న సార్ రైతు భరోసా ఎప్పుడు వేస్తారు...???

- రైతు భరోసా రామ్ రామ్ మేనా ...???
- రైతులకు పంట పెట్టుబడి వేస్తానన్న మాట మరిచినారా...???
- రైతు భరోసా ఇక వేస్తాం అగో వేస్తాం అంటూ పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం...!!!
- రైతు భరోసా ఆశలతో పంట సాగు కోసం అప్పులు చేసుకున్న రైతన్నలు..!!!





**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 20**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అలనాటి ఇందిరమ్మ పరిపాలన సాగుతుందేమో అని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించుకుంటే ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలను తుంగలో తొక్కి విధంగానే కాంగ్రెస్ పరిపాలన చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రైతులుపండించుకున్నటువంటి పంటకు పెట్టుబడిగా రైతు భరోసా పేరిట రైతులు పంటపండించుకునే సమయానికి రైతుల ఖాతాలో రూపాయలువేసేవారని పలువురు రైతులు తెలియజేశారు కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనమూడు సంవత్సరాలు గడుస్తున్నా సందర్భంలో ఎనాడు సరియైన సమయాలలో రైతులకు పంట పెట్టుబడి వేయలేదని పలువురు రైతులు ఆరోపణలు చేస్తున్నారు గత డిసెంబర్ లోనే రైతు భరోసా వేస్తారని హామీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3 నెలల నుండి ఇక వేస్తాం అంటూ మూడు నెలలు గడిచిన కూడా ఇప్పటి వరకు కూడా రైతుల ఖాతాలు డబ్బులు వేయలేని కాంగ్రెస్ ప్రభుత్వమని పంట పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేసి పంట సాగు చేసుకున్నారు గత స్థానిక సంస్థ సర్పంచ్ ఎన్నికల ముందే రైతు భరోసా వెళ్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికల కోడ్ వలన వేయలేకపోతున్నామని స్థానిక సంస్థల అనంతరం వేస్తామని మీడియా ద్వారా సమాచారాలను తెలియజేశారు ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల పేరుతో పబ్బం గడిపి మున్సిపల్ ఎన్నికల అనంతరం రైతు భరోసా రైతులకు పంట పెట్టుబడిగా వేస్తామని తెలియజేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మునిసిపల్ ఎన్నికల అనంతరం ఫిబ్రవరి 16 లేక 17వ తేదీన రైతు భరోసా రైతు ఖాతాలో ఏకధాటిగా వేస్తామని ప్రకటనలకే తప్ప రైతు ఖాతాలో రైతు భరోసా వేయకపోవడంతో రైతు ఖాతాలో రైతు భరోసా డబ్బులు వేస్తారా వేయలేరా అని రైతులు నిరాశ చెందుతున్నారు తెలంగాణ రాష్ట్రంలో రానున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల ముందైన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా రైతు ఖాతాలో వేయరని నమ్మకసత్యాన్ని రైతులు నిరాశ చెందుతున్నారు తెలంగాణ రాష్ట్రంలో మూడవసారి జరిగినటువంటి ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాల హామీలను ఇచ్చినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చెంపపెట్టుగానే ప్రభుత్వ పాలన సాగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర్థం అవుతుంది గతంలో కాంగ్రెస్ పరిపాలనలో రైతులకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తూపరిపాలన సాగింది అని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన ఇలా ఉంది అంటే మాయ మాటలు చెప్పి అధికారాన్ని చేజేక్కించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రజలను అణగదొక్కే విధంగానే పరిపాలన తాగుతుందని ఇటు రైతులు అటు ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నాను ఇచ్చిన మాటను తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రతిపక్ష నాయకులు ప్రచారాలను మొదలుపెట్టారు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పాటు అయి మూడు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి ఏంటి అని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తొలి దశలోనే స్థానిక సంస్థ ఎన్నికలను నిర్వహించకుండా రెండు సంవత్సరాలు గ్రామాలలో అధికారుల పరిపాలన సాగించినటువంటి ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని రెండు సంవత్సరాల అనంతరం స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించిన ఫలితం ఏమిటి అని రైతులు ప్రశ్నిస్తున్నారు రైతు భరోసా వస్తుంది అని ఆశతో రైతులు పంట పెట్టుబడి పెట్టుకొని పంటను సాగు చేసుకుంటున్నారు రైతు లేనిది రాజ్యం లేదు అని సామెత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియదా ఇకనైనా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన సాగాలి అంటే రైతులకుపంట పెట్టుబడిగా రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పంట సాగు కోసం వేస్తానన్న రూపాయలను వేయ లేకుంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ధర్నా రాస్తా రోకోలు చేసే ప్రయత్నంలో తెలంగాణ రాష్ట్ర రైతులు ఉన్నారని పలువురు రైతులు వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా రైతు పంట సాగు కోసం వేస్తానన్న రైతు భరోసా ద్వారా రైతు ఖాతాలో జమ చేస్తేనే రానున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల ప్రచారాలు సజావుగా సాగుతాయని లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు ఏ మొకాలు పెట్టుకొని ఓటు అడగడానికి వస్తారు అప్పుడే మాట్లాడతాము అని పలువురు రైతులు అనుకుంటున్నారు

## జమ్మికుంట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం

**– పట్టణాభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజా ప్రతినిధులకు అర్థిదారుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం....**



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 20**

జమ్మికుంట పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్‌లను జమ్మికుంట అర్థిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించినందుకు కృతజ్ఞతగా ఈ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమం జమ్మికుంట పట్టణంలో అత్యంత ఆత్మీయ వాతావరణంలో జరిగింది. అర్థిదారుల సంఘం అధ్యక్షుడు, అమాలి సంఘం అధ్యక్షుడు, దడ్వాయి సంఘం అధ్యక్షులు కలిసి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల నివాసానికి వెళ్లి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక కార్యకర్త ఎర్రబెల్లి రాజేశ్వరరావు హాజరై నాయకుల సేవలను కొనియాడుతూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పట్టణాభివృద్ధికి తీసుకున్న చర్యలు చైర్మన్ మరియు వైస్ చైర్మన్‌లు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జమ్మికుంటలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయి. ముఖ్యంగా--- ప్రధాన రహదారుల మరమ్మతులు మరియు కొత్త రహదారుల నిర్మాణం డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, నీటి నిల్వ సమస్యల ఎం ప్రతి వార్డులో వీధి దీపాల ఏర్పాటు పారిశుద్ధ్య కార్యక్రమాల విస్తరణ, చెత్త సేకరణలో పద్ధతి మున్సిపల్ పన్నుల వసూళ్లలో పారదర్శకత తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం ఈ చర్యల వల్ల పట్టణంలో గణనీయమైన మార్పు కనిపిస్తున్నదని సంఘ నాయకులు పేర్కొన్నారు. సంఘ నాయకుల అర్థిదారుల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ, "ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించే ధోరణి చైర్మన్, వైస్ చైర్మన్‌ల ప్రత్యేకత. పట్టణాభివృద్ధి విషయంలో వారు చూపుతున్న కట్టుబాటు అభినందనీయం" అని అన్నారు.

అమాలి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ, "ప్రతి వర్గానికీ సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి నిదర్శనం" అని పేర్కొన్నారు.

దడ్వాయి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ, "పట్టణంలో పారిశుద్ధ్యం, రహదారుల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలు అవుతున్నాయి. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాం" అని అన్నారు.

ఎర్రబెల్లి రాజేశ్వరరావు అభినందనలు

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎర్రబెల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, "ప్రజా సేవ అంటే కేవలం పదవిలో ఉండటం కాదు, ప్రజల అవసరాలను అర్థం చేసుకుని స్పందించడం. ఈ విషయంలో జమ్మికుంట మున్సిపల్ నాయకత్వం ఆదర్శంగా నిలుస్తోంది" అని ప్రశంసించారు. పట్టణ అభివృద్ధి కోసం సంఘాలు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలని సూచించారు.

నాయకుల స్పందన

సన్మానం స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, "ఈ గౌరవం మా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, మున్సిపల్ బృందం మొత్తం కృషికి లభించిన గుర్తింపు. ప్రజల సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు" అని తెలిపారు.

వైస్ చైర్మన్ మాట్లాడుతూ, "ప్రతి వార్డులో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం" అని హామీ ఇచ్చారు.

ప్రజల భాగస్వామ్యం

ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూలతో, శాలువాలతో, శుభాకాంక్షలతో నాయకులను అభినందించారు. కార్యక్రమం ముగింపులో పరస్పర కృతజ్ఞతాభావంతో సమావేశం ముగిసింది.

జమ్మికుంట పట్టణ అభివృద్ధి దిశగా మున్సిపల్ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల ఆశలు నెరవేర్చాలని సంఘ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమం ప్రజా ప్రతినిధులపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసినట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు.

## పైన చూస్తే చెప్పుల షాపు లోన బంగారం కంటే దోపిడీ ఎక్కువ పైన పటారం లోన లోటారం అనేసందంగా చెప్పుల షాపు "మానస ఫ్రెండ్స్ షూ మార్ట్" పేరిట ఘరానా మోసం?

**-- పేదల జేబులపై దాడి చేస్తున్నారనే ఆరోపణలు**
**-- జిల్లా యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకోవాలి..,.**

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 20**

జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద నడుస్తున్న మానస ఫ్రెండ్స్ షూ మార్ట్ అనే దుకాణం యాజమాన్యంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. చెప్పులు కొనుగోలు చేయడానికి వెళ్తున్న కస్టమర్లను లక్ష్యంగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంఆర్పీ తొలగించి స్వంత రేట్లు?

ప్రజల వాదన ప్రకారం, చెప్పుల బాక్స్‌పై కంపెనీ ముద్రించిన అసలు ఎంఆర్పీ స్టిక్కర్‌ను తొలగించి, దాని స్థానంలో షాప్ యాజమాన్యం తమ సొంతంగా ముద్రించిన అధిక ధర స్టిక్కర్‌ను అతికించి విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇది వినియోగదారుల హక్కులకు విరుద్ధమని, స్పష్టమైన మోసపూరిత చర్య అని అంటున్నారు.

ఎవరైనా అసలు ధర గురించి ప్రశ్నిస్తే "మేము చెప్పులు అమ్మము, వెళ్లండి" అంటూ కస్టమర్లతో వాగ్వాదానికి దిగుతున్నారని పలువురు చెబుతున్నారు. సాధారణంగా ప్రజలకు సేవ చేయాల్సిన వ్యాపార సంస్థ ఇలా ప్రవర్తించడం దురదృష్టకరమని అభిప్రాయపడుతున్నారు.

పేదలపై ఆర్థిక భారం

రోజువారీ కూలీలు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే కుటుంబాలు తక్కువ ధరలో చెప్పులు కొనుగోలు చేయాలనే ఆశతో షాపుకు వెళ్తే, అధిక ధరలు చెప్పడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పాఠశాల పిల్లల కోసం చెప్పులు కొనుగోలు చేయడానికి వచ్చిన తల్లిదండ్రులు కూడా మోసపోతున్నారని ఆరోపిస్తున్నారు.





దళిత బంధు, జీఎస్టీ అంశాలపై అనుమానాలు

ఈ షాపు కేవలం వ్యాపార లాభాల కోసమే కాకుండా, దళిత బంధు పథకం పేరుతో తప్పుడు కొటేషన్లు సమర్పిస్తున్నారా? జీఎస్టీ చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఇలాంటి షాపులు ఏర్పాటు చేసి కేవలం ఫైల్స్ ప్రాసెసింగ్, కొటేషన్ల జారీ కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

అధికారుల తక్షణ చర్య అవసరం

స్థానిక ప్రజలు జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత వాణిజ్య, పన్నుల శాఖ అధికారులను కోరుతూ:



ఈ షాపు ద్వారా ఎన్ని దళిత బంధు కొటేషన్లు జారీ అయ్యాయో పూర్తి వివరాలు వెల్లడించాలి.

జీఎస్టీ రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపులపై సమగ్ర ఆడిట్ చేయాలి.

ఎంఆర్పీ నిబంధనలు ఉల్లంఘించారా లేదా అనే దానిపై ప్రత్యేక దర్యాప్తు జరపాలి.

తప్పులు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయాలి.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

ప్రభుత్వం వినియోగదారుల హక్కులను కాపాడేందుకు కఠినమైన చట్టాలను అమలు చేస్తున్నప్పటికీ, స్థానిక స్థాయిలో పర్యవేక్షణ లోపిస్తే ఇలాంటి అక్రమాలు పెరిగే ప్రమాదం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

పేద ప్రజల కష్టార్జిత ధనాన్ని దోచుకునే ప్రయత్నాలు ఎవరైనా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల హక్కులు రక్షించబడాలి... మోసాలకు తావులేకుండా చూడాలి!

## ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**--- అన్నం ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 20....**

హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని పాతర్లపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన "ఇందిరమ్మ ఇళ్లు ముగ్గు కార్యక్రమం"లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నం ప్రవీణ్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, లబ్ధిదారుల ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. పేద ప్రజలకు గృహ హక్కు కల్పించాలనే మహోన్నత సంకల్పంతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం, సామాన్య కుటుంబాలకు ఆత్మగౌరవం మరియు భద్రతను అందిస్తోందని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ గారి సహకారంతో పాతర్లపల్లి గ్రామానికి 24 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం విశేషమని తెలిపారు. గ్రామ ప్రజల సుదీర్ఘకాల స్వప్నం నెరవేరుతోందని, సొంత ఇంటి కల సాకారం అవుతోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు.





"ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం,
ప్రతి ఇంటికి సంతోషం,
ప్రతి కుటుంబానికి భద్రత"

అనే నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తోందని ప్రవీణ్ వివరించారు. గతంలో ఎన్నో సంవత్సరాలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడిన కుటుంబాలకు ఇప్పుడు భద్రమైన నివాసం లభిస్తోందని, ఇది ప్రజా ప్రభుత్వ సామాజిక బాధ్యతకు నిదర్శనమని అన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతున్నాయని, మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదాలు, సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్దామని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బైరెడ్డి కొండాల్ రెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మడిపల్లి మంగసంపత్, కొడారి సునీతారాజు, కొడారి లతకొమురయ్య, నాయకులు కోడం నారాయణ, కోడం భిక్షపతి, ఇతర గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. పాతర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో జరిగి ప్రతి కుటుంబం సంతోషంగా నివసించే రోజులు త్వరలోనే రావాలని ఆకాంక్ష వ్యక్తమైంది.

## పోలీస్ క్రీడలు ప్రారంభించిన మంత్రి అనిత

**– పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని వెల్లడి**

అమరావతిలోని మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీఎస్పీ వేదికగా జరిగిన రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజా భద్రత కోసం 24 గంటలు శ్రమించే మన పోలీసు సోదరులకు మానసిక ఉల్లాసం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమారు 6 రాష్ట్రాల నుండి వచ్చిన 10 జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్న తరుణంలో, ఇలాంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు ఇక్కడ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది.

## సదరం క్యాంపును పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన.

**భారతీయ వెలుగు న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**
కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ సదరం క్యాంపును శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపులో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైద్య పరీక్షలు, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సేవల లభ్యత, వైకల్యం నిర్ధారణకు వినియోగిస్తున్న పరికరాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రతి దివ్యాంగుడికి అవసరమైన గుర్తింపు మరియు సర్టిఫికేషన్ అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ యు డి ఐ డీ కార్డులు తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు



పొందుతాయని తెలిపారు . ఈ కార్డుల ద్వారా దివ్యాంగులు ఆరోగ్య, విద్య, ఉపాధి, రవాణా తదితర రంగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందగలరని తెలిపారు. ప్రతి దివ్యాంగుడు సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా యూడీఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసిన దివ్యాంగులకు ఆసుపత్రిలో వైకల్యం నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేయాలని, ముందస్తుగా దరఖాస్తుదారులకు సమాచారం అందించి సమయానికి పరీక్షలు జరిగేలా చూడాలని సూచించారు. వైద్య పరీక్షల సమయంలో అవసరమైన వైద్య నిపుణులు, పరీక్షా పరికరాలు మరియు సాంకేతిక సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సదరం క్యాంపు ప్రాంతంలో దివ్యాంగులు ఇబ్బంది పడకుండా రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, వీల్‌చెయిర్లు వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని సూచించారు. దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని అన్నారు .పరీక్షల అనంతరం ప్రతి దివ్యాంగుడి వైకల్యం శాతం, వ్యక్తిగత వివరాలు, వైద్య నిపుణుల సర్టిఫికేషన్ వివరాలను సమగ్రంగా యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేసి, ఎటువంటి లోపాలు లేకుండా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమాచారం డిజిటల్ రూపంలో భద్రపరచడం వల్ల భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు ఇది బలమైన ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు.
ఈ పరిశీలనలో వైద్య నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గం తోనే సుఖవంతమైన జీవితం

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 20**
మహబూబాబాద్ జిల్లా లో
రాజీమార్గం మరియు ఇచ్చిపుచ్చుకునే ధోరణి ల వల్లనే మానవుడు సుఖవంతమైన జీవితం గడపగలుగుతాడని మహబూబాబాద్ మధ్యవర్తిత్వకేంద్ర న్యాయవాది వై చెన్న మల్లారెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జె ఎన్ టి యు మహబూబాబాద్ ఇంజనీరింగ్ కళాశాల లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వ కేంద్ర న్యాయవాది విద్యార్థులకు కోర్టులలో కేసుల పరిష్కార ప్రక్రియ తదితరాలను వివరించారు. కోర్టు కేసులలో చిక్కుకున్న ఇరుపక్షాల వారికి అసలు నిజం ఏమిటో తెలుసునని, దానికి అనుగుణంగానే వారు రాజీమార్గంలో కేసును పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వ కేంద్రం వారికి సహాయపడుతుందన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రంలోని సేవలు అన్ని పూర్తిగా ఉచితమేనన్నారు. కోర్టు కేసులలోనే కాకుండా నిజ జీవితంలో కూడా రాజీ ధోరణి మంచిదేనన్నారు. అంతేకాకుండా యువత తప్పు దారి




పట్టడానికి కారణమవుతున్న మాదక ద్రవ్యలకు దూరంగా ఉండాలన్నారు, సరదా కోసమో , తక్షణ శక్తి ని పొందావచ్చనే అపోహాలో విద్యార్థులు మాదక ద్రవ్యాల ఉచ్చు లో చిక్కుకొవద్దన్నారు. డ్రగ్స్ సరఫరా నే కాదు వినియోగం కూడా కఠిన శిక్షలకు దారితీస్తాయన్నారు. అనంతరం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జాతీయ యువత రీల్ / లఘు చిత్రాల నిర్మాణ పోటీల గురించి వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ను సంప్రదించవలెనన్నారు. ఈ కార్యక్రమంలో లో కళాశాల ప్రిన్సిపల్ బలరాం నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు విలువలకు ప్రతీక యాసా జీవితం

- **యాసా వెంకట్ నారాయణ అంతిమయాత్రలో వివిధ పార్టీల నాయకుల నివాళి**

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 20**
మహబూబాబాద్ జిల్లా లో
న్యూమోక్రసీ సీనియర్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యాస వెంకట్ నారాయణ నిన్న అనారోగ్యంతో మరణించారు. ఆయన అంతిమయాత్ర స్వగ్రామమైన తాసిల్దార్ బంజర్ లో ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అధ్యక్షతన జరిగిన సభలో వివిధ పార్టీల నాయకులు పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల



వెంకన్న, నున్న అప్పారావు తదితరులు ప్రసంగించారు. వెంకటనారాయణ గత నాలుగున్నర దశాబ్దాలుగా డోర్నకల్ కేంద్రంగా విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేశాడని, అనేక ఆటుపోట్లను నిర్బంధాన్ని ఎదుర్కొని చివరి శ్వాస దాకా కమ్యూనిస్టుగా నిలబడ్డాడని కొనియాడారు. భూస్వాములకు పెత్తందారులకు వ్యతిరేకంగా ప్రజలని నిలబెట్టాడని, ప్రజలకు పార్టీ కార్యకర్తలకు పెద్దదిక్కుగా వ్యవహరించాడని వారన్నారు. తాసిల్దార్ బంజర గ్రామాన్ని న్యూడెమోక్రసీ పార్టీకి కేంద్రంగా నిలబెట్టడంలో వెంకట్ నారాయణ పాత్ర ప్రధానమైనదని అన్నారు. ఆయన మరణం పార్టీకే కాకుండా ప్రజా ఉద్యమాలకు, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు అని వక్తలు పేర్కొన్నారు. దేశంలో రోజురోజుకు తీవ్రతవారమవుతున్న నిర్బంధ కాండను ఐక్యంగా ఎదుర్కోవాలని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు దేశాన్ని ఫాసిజం వైపు తీసుకెళ్తున్న నియంత పాలన ఎదిరించడానికి ఐక్య ఉద్యమాలు నిర్మించాలని, నికార్సైన కమ్యూనిస్టుగా జీవించిన యాసా వెంకట్ నారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టులు బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలని వారు పిలుపునిచ్చారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన పార్టీ శ్రేణులు బంధుమిత్రుల ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబా డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, ప్రగతి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఊకే పద్మ పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు బండారి ఐలయ్య,హలావత్ లింగ్యా,తిరుపతమ్మ రాకేష్ గుజ్జ దేవేందర్ ఎస్.కె బాబు, బట్టు చైతన్య, బోనగిరి మధు,నాగు బండి భాస్కర్, వై ప్రకాష్ లక్ష్మీనారాయణ లతోపాటు మాస్ లైన్ నాయకులు ఆర్ శివలింగం సిపిఎం నాయకులు శెట్టి వెంకన్న,మైసా శ్రీనివాసులు వివిధ పార్టీల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు గృహ ప్రవేశంలో పాల్గోన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య





- **అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇంటి ద్వారా వారి సొంత ఇంటికలను సాకారం చేస్తాం-ఎమ్మెల్యే కనకయ్య .**

**భారతీయ వెలుగు న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**
ఇందిరమ్మ ఇళ్ళు మంత్రి పొంగులేటి నాయకత్వంలో ఇంకా మూడు విడతలు ఇస్తాం అని,పేదలందరిని అదుకోవాలనే మంచి ఉద్ధేశంతో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నది అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇల్లందు మండలం ఇందిరానగర్ గ్రామ పంచాయితి లో ప్రజా ప్రభుత్వం లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళు గృహ ప్రవేశం కార్యక్రమానికి కుటుంబ సమేతంగా ముఖ్య అతిధిగా హజరై లబ్ధాధారు పొలెబోయిన భాగ్యాలు కుటుంబ సభ్యులతో కలసి గృహ ప్రవేశం చేయించిన శాసన సభ్యులు కోరం కనకయ్య. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాయం లలిత భార్గవ్,మజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్,ఉప సర్పంచ్ ఆదిత్య,మడుగు సాంబమూర్తి,బండి
ఆనంద్,ఈసంలక్ష్మణ్,రాకేష్,నవీన్,వికాస్,రాము,యల్ల య్య,మాజీ సర్పంచ్ కల్తీ పద్మ,గాలిపల్లి స్వరూప తదితరులు పాల్గోన్నారు.

## నిరుద్యోగ యువత కు ఐటిడిఏ పూర్తి సహకారం అందిస్తుంది...

- **అవసరం మేరకు పుస్తకాలు, గ్రంథాలయాల ఏర్పాటుకు సిద్ధం...**
- **భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్.**

**భారతీయ వెలుగు న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**
ఉత్సాహవంతులైన నిరుద్యోగులైన యువతి యువకులకు డీఎస్సీ, గ్రూప్ వన్ గ్రూప్ టు, ఇతర కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి కావలసిన మెటీరియల్, పుస్తకాలు మరియు ఆన్లైన్ క్లాసుల నిర్వహణకు ఐటీడీఏ ద్వారా తప్పనిసరిగా సహాయ సహకారాలు అందిస్తానని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ యువతి యువకులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం నాడు కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంను



గ్రంథాలయం చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆహ్వానం మేరకు ఆయన సందర్శించి, గ్రంథాలయంలోని అన్ని గదులను పరిశీలించి కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతి యువకులకు పలు సూచనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే యువతి యువకులు శ్రద్ధగా చదివి అనుకున్నది సాధించే వరకు విశ్రమించకూడదని, అవసరమైతే అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని పరీక్షలకు ప్రిపేర్ కావాలని అన్నారు. కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఐటీడీఏ తరఫున అందిస్తానని అన్నారు. గిరిజన యువతి యువకులు ఇతర కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి మారుమూల మండలాలలో గ్రంథాలయంలు లేక ఇబ్బందులు పడుతున్నారని చంద్రుగొండ, టేకులపల్లి, దమ్మపేట మండలాలలో తప్పనిసరిగా గ్రంథాలయం నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా సహకరించాలని గ్రంథాలయం చైర్మన్ వీరబాబు పిఓ దృష్టికి తీసుకురాగా ఆ మండలాలలో ప్రభుత్వ స్థలాలు ఏమైనా ఖాళీగా ఉంటే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకొని వెంటనే ప్రతిపాదనలు తనకు పంపించాలని, తప్పనిసరిగా ఆ మండలాలలో గ్రంథాలయం నిర్మాణం చేపట్టి పాఠకులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతి సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డీఈలు, ఏఈలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరస్తు శుభమస్తు కళ్యాణమస్తు





- **సర్వేజనా సుఖినోభవంతు.**
- **పాల్గుణ మాసంలోకి ప్రవేశించిన భద్రాద్రి గోదావరి (ఆదివారం) హారతి.**

**భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 20 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**
ఫిబ్రవరి 22 పంచమి ఆదివారం నిర్వహిస్తున్న గోదావరి హారతిని జయప్రదం చేయండి.
గోదావరి హారతికి అందరికీ ఇదే మా ఆహ్వానంభద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గౌశ్రీశ్రీ శ్రీ. జితేష్ వి పాటిల్ గారి సత్సంకల్పంతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల లో ప్రారంభమై భక్త మహాశయుల కోర్కె మేరకు భద్రాచలం దివ్య క్షేత్రంలో పుణ్య గోదావరి స్నాన ఘట్టాల వద్ద ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న గోదావరి హారతి పాల్గు ణమాసంలోకి ప్రవేశించి భక్తుల సంఖ్యను పెంచుతోంది. మాఘాది పంచకాలు విశేషమైన మాసములు. పాల్గుణ పౌర్ణమికి శ్రీరామచంద్రుని పెండ్లి కుమారునిగా అలంకరిస్తారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం కూడా పాల్గు ణపౌర్ణమి నాడు నిర్వహిస్తారు. హోలీ పండుగ ఈరోజే జరుగుతుంది. పాల్గుణమాసంలో నిర్వహించు గృహప్రవేశం మొదలగు శుభకార్యాలలో పాలు పొంగిన విధంగా మీ కుటుంబాలు అభివృద్ధి చెందాలని కుటుంబ పెద్దలు ఆశీర్వదించడం ఆనవాయతీగా వస్తోంది. ఫిబ్రవరి 22వ తేదీపాల్గుణ శుద్ధ పంచమి ఆదివారం దివ్య క్షేత్రం భద్రాద్రి లో నిర్వహిస్తున్న గోదావరి హారతి కార్యక్రమంలో పాల్గొని శ్రీరామా అనుగ్రహంతో గోదావరి మాత శుభాశీస్సులు పొందాలని భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు రామావజల రవికుమార్ గ్రామస్తులకు భక్తులకు విజ్ఞప్తి చేశారు. లోకాసమస్తా సుఖినోభవంతు

## బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేయడమే యూరియా యాప్ ముఖ్య ఉద్దేశం

- **హింగే శ్రీకాంత్ యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు**

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 20భారతీయ వెలుగు**
ఎల్కతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు హింగే శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ..
యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌ను రాజకీయం చేయవద్దని హింగే శ్రీకాంత్ ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. వరుసగా ఎన్నికల్లో ఎదురైన ఓటములను జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ప్రతిపక్షాలు యూరియా యాప్‌ను సాకుగా ఉపయోగిస్తున్నాయని ఆయన ఆరోపించారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ఫలితాలను అంగీకరించలేక కొంతమంది నాయకులు రైతుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందుబాటులో ఉందని, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేయడమే యాప్ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సాగు భూమి



వివరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ జరిగే విధంగా యాప్‌ను రూపొందించారని తెలిపారు. రైతులు ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో యూరియా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించడం ద్వారా పారదర్శకత పెరిగిందన్నారు. కొంతమంది వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో యూరియా కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. యాప్ వినియోగంపై అవగాహన లేని రైతులు రైతు వేదికల వద్ద ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ ఆధారంగా రెండు నిమిషాల్లో నమోదు పూర్తి చేసి మరుసటి రోజే యూరియా అంద జేస్తున్నారని వివరించారు.
ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే ఉద్దేశంతో ప్రచారం చేస్తున్న వారి మాటలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# ఇల్లందు డిఎస్పీగా నియమితులైన వెంకన్న బాబు..

- **ఎమ్మెల్యే కోరం కనకయ్య తో మర్యాదపూర్వక భేటీ...**

**భారతీయ వెలుగు న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**
ఇల్లందు డిఎస్పి గా నియమితులైన వెంకన్న బాబు శుక్రవారం క్యాంప్ కార్యాలయం నందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కు పుష్పగుచ్ఛం అందచేసి మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం ఇరువురు ఇల్లందు ప్రాంత శాంతిభద్రతలు పై చర్చించారు.



## 18వ వార్డు కౌన్సిలర్ జక్కుల మల్లయ్య గారిని యాదవ కుల సంఘం సభ్యులు శాలువా పూలమాలలకు ఘనంగా సన్మానించినారు

**భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 21 సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం**



హుజుర్నగర్ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిలర్లుగా విజయం సాధించిన యాదవ బంధుమిత్రులయిన జక్కుల మల్లయ్య యాదవ్ గారిని, కోడి జ్యోతి ఉపేందర్ యాదవ్ గారిని మోదాల కామేశ్వరి సైదులు యాదవ్ గారిని సూర్యాపేట జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మర్యాద సైదులు యాదవ్ గారు, పెద్ద గట్టు లింగమంతుల స్వామి చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్ గారు, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి తూము వెంకన్న యాదవ్ గారు, జిల్లా యాదవ సంఘం నాయకులు వేల్పుల లింగయ్య యాదవ్ గారు, కోడి లింగయ్య యాదవ్ గారు మరియు హుజూర్‌నగర్ మాజీ ఛైర్మన్ జక్కుల వెంకయ్య గారు, జక్కుల వీరయ్య గారు, జక్కుల శాంబయ్య గారు, జక్కుల జయరాం గారు, జక్కుల శ్రీను గారు,జక్కుల నాగరాజు గారు, జక్కుల నవీన్ గారు తధితరులు షాలువాలతో ఘనంగా సన్మానించినారు మరియు భవిష్యత్ లో యాదవులు ఐక్యతగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలని కాంక్షించినారు.

Publishers Gunnala lavanya Printers VASISTA PRINTERS Pothuganti Rajanna, 18-97#306, 3rd Floor, Rajini gandha Complex , kamala Nagar, Chaitanyapuri, Rangareddy, Telangana, 500060 Aditar Gunnala Anilreddy Phone 9642844456, 9705043131